గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 132, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, సోమవారం - 17- జూన్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఈవీఎంలను బహిష్కరించాలి



ఈవీఎంలపై ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యల పట్ల రాహుల్ గాంధీ స్పందన

ఈవీఎంలను కొంతమేర హ్యాక్ చేసే అవకాశముందున్న ఎలాన్ మస్క్

భారత్ లోని ఈవీఎంలు బ్లాక్ బాక్స్ ల వంటివి అంటూ రాహుల్ ట్వీట్

## అదుపుతప్పి లోయలో పడ్డ మినీ బస్సు..



**14 మంది దుర్మరణం**

ఉత్తరాఖండ్ లో ఘోర రోడ్డు ప్రమాదం

రిషికేశ్- బద్రినాథ్ హైవేపై అలకనందా నది ఒడ్డున దారుణం

తీవ్రంగా గాయపడ్డ మరో 12 మంది టూరిస్టులు

## బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అరెస్ట్



హైదరాబాద్: హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మెదక్ అల్లర్లను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా ఆయన్ను అదుపులో తీసుకున్నారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన రాజాసింగ్.. మియాపూర్ ఆస్పత్రికి వెళ్తున్న క్రమంలో ఎయిర్‌పోర్టులోనే పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు.

## ఈవీఎంలు రద్దు చేయాలి మస్క్ సంచలన వ్యాఖ్యలు



ఢిల్లీ: ప్రపంచంలోని చాలాదేశాల్లో ఓటింగ్ ప్రక్రియకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్స్ ఉపయోగిస్తున్నారు. దీనిపైన ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత 'ఇలాన్ మస్క్' కీలక వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన ఓ ట్వీట్ నెట్టింట్లో తెగ వైరల్ అవుతోంది. ఇటీవల ప్యూర్టో రికో దేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లలో అవకతవకలు జరిగాయని ఇండిపెండెంట్ ప్రెసిడెంట్ అభ్యర్థి రాబర్ట్ ఎఫ్. కెన్నెడీ తన ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందిస్తూ.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించిన వందల కొద్దీ ఓటింగ్ అక్రమాలను ఎదుర్కొన్నట్లు వివరాయించారు. అదృష్టవశాత్తూ, పేపర్ ట్రయిల్ ఉంది కాబట్టి సమస్యను గుర్తించి ఓట్ల లెక్కలు సరిచేసినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఈవీఎంల వాడకాన్ని వదిలేసి మళ్ళీ పేపర్ బ్యాలెట్‌లకు తిరిగి రావాలని ఆయన పేర్కొన్నారు. రాబర్ట్ ఎఫ్.

## 'నీట్' అక్రమాలపై విచారణ జరపాలి



కేటీఆర్ బహిరంగ లేఖ

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడినా కేంద్రం పట్టించుకోవడం లేదు

ఓవైపు గ్రేస్ మార్కుల గందరగోళం.. మరోవైపు పేపర్ లీకేజీల వ్యవహారంతో తల్లిదండ్రుల్లో ఆందోళన

చదివిన విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలి

# రేవంత్ నంబర్ వన్ !

- దేశంలో కొత్త రాష్ట్ర ప్రభుత్వాలు కొలువు
- దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులకు వివిధ రకాలుగా వేతనాలు
- అన్ని రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రికి బస, వాహనం, భద్రతతోపాటు దేశ విదేశాల్లో ఎక్కడికైనా వెళ్లే వెసులుబాటు
- త్రిపుర ముఖ్యమంత్రికి దేశంలోనే అత్యల్ప జీతం రూ.1.05 లక్షలు
- తెలంగాణ ముఖ్యమంత్రి అత్యధికంగా రూ.4.10 లక్షల వేతనం
- తెలంగాణ తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రికి రూ.3.90 లక్షలు మూడవ స్థానం



హైదరాబాద్: దేశంలో కొత్త రాష్ట్ర ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కొత్త ముఖ్యమంత్రులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులకు వివిధ రకాలుగా వేతనాలు ఉంటాయి. అన్ని రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రికి బస, వాహనం, భద్రతతోపాటు దేశ విదేశాల్లో ఎక్కడికైనా

## అన్నా క్యాంటీన్ల ప్రారంభ ముహూర్తం ఖరారు - ధరలు ఇలా..!!



అమరావతి: ఏపీ ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. హామీల అమలుకు ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడుతూనే వెంటనే అమలు చేయాల్సిన అయిదు హామీల పైన సంతకాలు చేసారు. అందులో భాగంగా అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రారంభ ముహూర్తాన్ని మంత్రి నారాయణ వెల్లడించారు. అదే విధంగా క్యాంటీన్ల నిర్వహణ.. పదార్థాల ధరలను ఖరారు చేసారు.

## బాబు, పవన్ రాజకీయ వ్యూహం
# 2024 కాదు 2029

- బాబు పవన్ జోడీ అయిదేళ్ళా ?
- వైసీపీని మరోసారి ఓడిస్తే కనుక ఇక ఆ పార్టీ అన్నదే ఉండదు
- టీడీపీ జనసేన పొత్తు పదేళ్ల పాటు కొనసాగాలి
- 2029 లో మరోసారి కూటమి గెలిస్తే అపుడు పవన్ లోకేష్ ల మధ్య ముఖ్యమంత్రి పదవుల విషయంలో పంపకం ఉండొచ్చు
- ఏపీలో మూడో పార్టీని లేకుండా చేయాలన్న ఏకైక లక్ష్యంతో బాబు పవన్ కదులుతున్న వేళ వైసీపీకి ఇది అత్యంత కఠిన పరీక్ష అని చెప్పక తప్పదు.



అమరావతి: ఏపీలో కొత్త చంద్రబాబుని అంతా చూస్తున్నారు. బాబు సాధారణంగా అధికారం విషయంలో ఎవరితోనూ పంచుకోరు అని ప్రచారంలో ఉంది. దానికి ఉదాహరణలూ చరిత్ర పుటల నుంచి చెబుతారు.

## ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరించిన ఏపీ సీఎం చంద్రబాబు




అమరావతి: రాఘవి మీడియా సంస్థ కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ పేరిట కొన్నాళ్లుగా సినీ రంగంలోని వివిధ రంగాల ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేస్తోంది. ఈసారి జూన్ 29న సాయంత్రం 6 గంటలకు హైదరాబాదులోని దసపల్లా హోటల్ లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డుల ప్రదానం చేయనున్నారు. ఈ నేపథ్యంలో, కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ పోస్టర్ ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేడు ఆవిష్కరించారు. ఇవాళ అమరావతిలో సీఎం చంద్రబాబును రాఘవి మీడియా ప్రతినిధులు కలిశారు. కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ గురించి ఆయనకు వివరించారు. వారు చేస్తున్న ప్రయత్నాన్ని సీఎం చంద్రబాబు మనస్ఫూర్తిగా అభినందించారు. పోస్టర్ ను విడుదల చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరు బ్లాకులకు వేలం నిర్వహించాలి

జూన్ 30లోగా ఆ పని చేయండి.. తెలంగాణకు కేంద్రం డెడ్ లైన్

రాష్ట్రం చేపట్టకపోతే ఆ ప్రక్రియను తామే పూర్తి చేస్తామని కేంద్ర గనుల శాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ

సీఎం అనుమతి రాగానే వేలం



హైదరాబాద్: గనుల వేలంపై తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం కీలక సూచన చేసింది. జూన్ 30 వ తేదీ లోపు కనీసం ఆరు బ్లాకులకు వేలం నిర్వహించాలని స్పష్టం చేసింది. ఒక వేళ ఆ పనిని రాష్ట్రం చేపట్టకపోతే ఆ ప్రక్రియను తామే పూర్తి చేస్తామని కేంద్ర గనుల శాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖను రాసింది. తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం ఒక్క మినరల్ బ్లాక్ ను కూడా వేలం వేయలేదని కేంద్ర గనుల శాఖ పేర్కొంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి

## ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు పవన్ కళ్యాణ్ తొలి లేఖ!



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు మొదటి లేఖ రాశారు. ఈ లేఖలో తన మనసులోని ఆలోచనలు ప్రజలతో పంచుకున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా నేను నిర్వర్తించబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా నేను నిర్వర్తించబోయే శాఖలు నా మనసుకు, జనసేన మూల సిద్ధాంతాలకు చాలా దగ్గరగా ఉన్నాయి. ఈ బాధ్యతలు సంతోషం కలిగిస్తున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక.. ఈ శాఖలన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవి, ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చేవిగా నేను భావిస్తున్నాను. 2008 నుంచి ప్రత్యక్ష రాజకీయాలలో ఉన్న నేను ఉభయ తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా పర్యటించి ఉన్నాను. 2019 ఎన్నికలకు ముందు ప్రజా పోరాట యాత్రను ప్రజల సమస్యల అవగాహన, మౌలిక సదుపాయాల కల్పనపై అధ్యయనం కోసమే తలపెట్టాను. చాలా లోతుగా ఆనాడు స్వయంగా పరిశీలన జరిపాను. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రతీ ప్రాంత సమస్యలపై బలమైన అవగాహన ఏర్పడింది. విశాఖ మన్యంలో పర్యటిస్తున్నపుడు కురిడి అనే గిరిజన

## ఓఆర్ఆర్ యూనిట్‌గా
# విపత్తు నిర్వహణ

వర్షాకాలంలో పటిష్ట చర్యలు చేపట్టాలి

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు హోంగార్డుల రిక్రూట్‌మెంట్ చేపట్టాలి

మంత్రులతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి



హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్డు యూనిట్‌గా తీసుకొని విపత్తు నిర్వహణ జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవి గుప్తాతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు.

# ఈవీఎంలను బహిష్కరించాలి

ఢిల్లీ: ఈవీఎంలను కొంతమేర హ్యాకింగ్ చేసేందుకు అవకాశం ఉందని, ఈవీఎంలను బహిష్కరించాలని వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్ పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. భారత్ లో ఈవీఎంలు బ్లాక్ బాక్స్ ల వంటివని, కనీసం వాటిని పరిశీలించేందుకు కూడా ఎవరికీ అనుమతి ఇవ్వరని ఆరోపించారు. ఇలాంటివి చూస్తుంటే మన ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై తీవ్రస్థాయిలో సందేహాలు కలుగుతున్నాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. వ్యవస్థల్లో జవాబుదారీతనం లోపించినప్పుడు ప్రజాస్వామ్యం ఒక బూటకంగానే మిగిలిపోతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు, మొబైల్ ఫోన్ సాయంతో ఈవీఎంను హ్యాక్ చేసిన ఆరోపణలపై ముంబయి ఎంపీ బావమరిది మీద కేసు నమోదైన వార్తా క్లిప్పింగ్ ను కూడా రాహుల్ తన ట్వీట్ కు జత చేశారు.

# అదుపుతప్పి లోయలో పడ్డ మినీ బస్సు..

## 14 మంది దుర్మరణం

ఉత్తరాఖండ్ : దేవభూమి ఉత్తరాఖండ్ లోని పర్యాటక ప్రాంతాలను చూసొద్దామని బయలుదేరిన టూరిస్టులు రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్నారు. వారు ప్రయాణిస్తున్న మినీ బస్సు అదుపుతప్పి హైవే పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. దాదాపు 1500 అడుగుల పైనుంచి పడడంతో బస్సు నుజ్జునుజ్జుగా మారింది. అందులోని 26 మంది టూరిస్టుల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. రుద్రప్రయాగ్ జిల్లాలో శనివారం చోటుచేసుకుందీ దారుణం. ఢిల్లీకి చెందిన 26 మంది టూరిస్టులు ఓ మినీ బస్సులో ఉత్తరాఖండ్ యాత్రకు బయలుదేరారు. శనివారం రుద్రప్రయాగ్ జిల్లా చేరుకున్నారు. రిషికేశ్-బద్రినాథ్ హైవేపై అలకనందా నది పక్క నుంచి వెళుతుండగా ప్రమాదం జరిగింది. మినీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వారిని ఢీ కొడుతూ అలకనందా నదిలో పడిపోయింది. చాలా ఎత్తు నుంచి పడడంతో మినీ బస్సు దారుణంగా దెబ్బతింది. లోపల ఉన్న టూరిస్టుల్లో 10 మంది అక్కడికక్కడే చనిపోగా ఆస్పత్రికి తరలిస్తుండగా మరో నలుగురు కన్నుమూశారు. మిగతా 12 మందికి తీవ్ర గాయాలు కాగా.. వారికి రిషికేశ్ ఎయిమ్స్ లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద ప్రధాని మోదీ రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలు అందించాలని అధికారులను ఆదేశించారు.

# 'నీట్' అక్రమాలపై విచారణ జరపాలి

హైదరాబాద్: నీట్ యూజీ ఎగ్జామ్ వ్యవహారంలో కేంద్రం తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ విషయమై ఆయన ఆదివారం(జూన్16) కేటీఆర్ ఒక బహిరంగ లేఖ రాశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడినా కేంద్రం పట్టించుకోవడం లేదని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు గ్రేస్ మార్కుల గందరగోళం.. మరోవైపు పేపర్ లీకేజీల వ్యవహారంతో తల్లిదండ్రుల్లో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పరీక్షా పే చర్చ నిర్వహించే ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు ఇప్పటికైనా నీట్ వ్యవహారంపై స్పందించాలన్నారు. మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ చేసి వెంటనే బాధ్యులను శిక్షించాలని కోరారు. కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని లేఖలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్ లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావడం ఎన్నోరకాల అనుమానాలకు తావిస్తోందని ధ్వజమెత్తారు. అందులో కూడా ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే.. పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. అలాంటిది.. ఇంత ఒకే సెంటర్ లో ఇంతమంది విద్యార్థులకు పెద్దమొత్తంలో మార్కులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అలాగే ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించటం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు. అసలు ఈ వ్యవహారం బయటకు రాగానే పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాల్సిన కేంద్రం ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని ఇప్పటిదాకా పట్టించుకోలేదని నిలదీశారు. పైగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అంతా సవ్యంగానే జరిగిందంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

నీళ్ల కోసం "క్యూ సెరా.. సెరా"

భారతదేశంలో రాజకీయ విజయం అంటే నీరు, విద్యుత్, రోడ్లు, ఉద్యోగాలు, నిత్యావసర వస్తువుల ధరలు లాంటి వాస్తవ సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం గురించి కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్(ట్విటర్)లో పేర్కొన్నారు. ఊహాజనిత సమస్యలు - ఉత్పాదక అవగాహనలతో ఎన్నికలు గెలిచినప్పుడు ఈ వాస్తవ సమస్యలపై పని చేయడానికి రాజకీయ పార్టీలకు ప్రోత్సాహం ఎక్కడ ఉందన్నారు. వారు చెప్పినట్లు ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో నీళ్ల కోసం "క్యూ సెరా, సెరా"నే అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఈవీఎంలు రద్దు చేయాలి మస్క్ సంచలన వ్యాఖ్యలు

కెన్నెడీ ట్వీట్ మీద మస్క్ స్పందిస్తూ.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను రద్దు చేయాలి. వీటిని ఎవరైనా ఏఐ టెక్నాలజీ ఉపయోగించి హ్యాక్ చేసే ప్రమాదం ఉందని అన్నారు. ఇది ఒక దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉంటుందని మస్క్ అన్నారు. మస్క్ చేసిన ట్వీట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. మస్క్ అభిప్రాయంతో చాలామంది ఏకీభవిస్తున్నారు. నిజానికి ఈవీఎంలో ఎంత సేఫ్టీ టెక్నాలజీలను ఉపయోగించి తయారు చేసినా.. అంతకు మించిన టెక్నాలజీతో హ్యాక్ చేసే ప్రమాదం ఉంది. కాబట్టి ఎన్నికల విషయంలో పేపర్ ఓటింగ్ ఉత్తమం అని పలువురు నెటిజన్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# అన్నా క్యాంటీన్ల ప్రారంభ ముహూర్తం ఖరారు - ధరలు ఇలా..!!

మొదటి పేజి తరువాయి

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మంత్రి నారాయణ తొలిగా అన్నా క్యాంటీన్ల పైన సమీక్ష చేసారు. గతంలో 203 అన్నకాంటీన్‌లకు అనుమతి ఇచ్చామని, 19 మినహా అన్ని అప్పట్లో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అన్న క్యాంటీన్‌లు రిపేర్ చేసి ఎస్టిమేషన్ ఇవ్వమని అధికారులకు చెప్పామన్నారు. గతంలో అన్న క్యాంటీన్‌లు ఇస్కాన్‌కు ఇచ్చామని, బ్రేక్ ఫాస్ట్‌కు, లంచ్, డిన్నర్‌కు 73 రూపాయలు ఖర్చు అవుతుందని, దీనిలో ఇస్కాన్ వాళ్ళకు 58 రూపాయలు ప్రభుత్వం ఇచ్చిందని మంత్రి నారాయణ తెలిపారు.

వంద క్యాంటీన్లు

అన్న క్యాంటీన్‌లో రోజు 2 లక్షల 20 వేలమంది తినేవారని, 4 కోట్ల 60 లక్షల 31 వేల 600 ప్లేట్‌లు గత ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ ద్వారా అందించామన్నారు. రద్దీ ఎక్కువగా వుండే మార్కెట్‌లు, పరిశ్రమలు వుండే చోట వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. రూరల్ ఏరియాలో 150 క్యాంటీన్‌లు ఇవ్వాలని కూడా అప్పట్లో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. అన్న క్యాంటీన్‌లు 15 రోజుల్లో ప్రారంభించాలని అధికారులను అడిగానని, అందుకు అధికారులు 21 రోజుల సమయం పడుతుందని చెప్పారని మంత్రి నారాయణ అన్నారు. అన్న క్యాంటీన్లు ఉన్న సచివాలయాలు తిరిగి అన్న క్యాంటీన్‌లకు ఇస్తామన్నారు.

రూ 5కే భోజనం

సచివాలయాలకు ప్రత్యామ్నాయ భవనాలు చూస్తామన్నారు. ప్రస్తుతానికి 100 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామన్నారు. ఇస్కాన్ వాళ్లు కూడా సెంట్రలైజ్ కిచెన్లు చాలా చోట్ల నిలిపేశారని, అన్న క్యాంటీన్ కుకింగ్ ఎక్విప్మెంట్‌ను తిరిగి ఇతర రాష్ట్రాల నుంచి తేవడానికి సమయం కావాలన్నారని వారు అడిగారన్నారు. చివరకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఎక్విప్మెంట్ కూడా పక్క రాష్ట్రాలకు తరలిపోయిందన్నారు. ఒక్కో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు అప్పట్లో రూ. 42 లక్షల ఖర్చు అయిందని, అన్నా క్యాంటీన్లు ప్రారంభమయ్యాక తిరిగి అయిదు రూపాయలకే భోజనం, టిఫిన్లు అందిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

# ఆరు బ్లాకులకు వేలం నిర్వహించాలి

మొదటి పేజి తరువాయి

11 బ్లాకుల జియాలాజికల్ నివేదికలను పంపించిటన్లు అధికార వర్గాలు తెలిపారు. వీటిలో ఐదు సున్నపురాయి, ఐదు ఇనుప ఖనిజం, ఒకటి మాంగనీస్ బ్లాకు ఉన్నాయని, గనుల వేలం విషయం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర గనుల శాఖ పలుమార్లు గుర్తు చేసినప్పటికీ ఆ ప్రక్రియ నిర్వహించలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో జూన్ 30 నాటికి కచ్చితంగా కనీసం ఆరింటికి వేలం పూర్తి చేయాలని లేఖలో స్పష్టం చేసింది. దేశంలో గనుల వేలం ప్రక్రియ 2015లో ప్రారంభం కాగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేయకుంటే వాటిని వేలం వేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి దక్కేలా 2021లో నిబంధనలను సవరించారు. దీని ప్రకారం దేశవ్యాప్తంగా 354 ప్రధాన మినరల్ బ్లాక్ లను వేలం వేయగా 48 చోట్ల ఉత్పత్తి ప్రారంభమైంది. కానీ తెలంగాణలో మాత్రం ఈ ప్రక్రియ జరగలేదని కేంద్రం ఆక్షేపించింది.

తెలంగాణలో మేజర్, మైనర్ మినరల్ బ్లాకులను వేలం పద్ధతిలో కేటాయించేందుకు గనుల శాఖ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఖనిజాల వారీగా ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపించారు. ఇందులో మూడు సున్నపురాయి బ్లాకులు, 12 చిన్నతరహా ఖనిజాల బ్లాకులు ఉన్నట్లు సమాచారం. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ఆమోదం రాగానే వేలం ప్రక్రియ ను ప్రారంభించేందుకు గనుల మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

కిషన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ అనంతరం కీలక ప్రకటన:

కాగా, ఇటీవలే బొగ్గు, గనుల శాఖ మంత్రిగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గనుల వేలం విషయంలో బొగ్గు గనుల శాఖ ఒక కీలక ప్రకటన చేసింది. వాణిజ్యపర అవసరాల కోసం ఉద్దేశించిన బొగ్గు గనుల వేలం వచ్చే వారం జరుగుతుందని బొగ్గు గనుల శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పదో రౌండ్ కమర్షియల్ బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తారని పేర్కొంది. ఇందులో 62 బ్లాకులను అమ్మకానికి పెడుతారని తెలిపింది.

# బాబు, పవన్ రాజకీయ వ్యూహం

# 2024 కాదు 2029



మొదటి పేజి తరువాయి

1995లో ఎన్టీఆర్ నుంచి అధికారాన్ని తీసుకుని తోడల్లుళ్లు చంద్రబాబు దగ్గుబాటి వెంకటేశ్వరావు టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో దగ్గుబాటికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తామని చెప్పారు చంద్రబాబు. కానీ ఆ తరువాత ఇవ్వలేదు. దాంతో దగ్గుబాటి తిరిగి ఎన్టీఆర్ వైపు వెళ్లారు. ఆ తరువాత 2014 వరకూ ఉప ముఖ్యమంత్రి ఊసే లేదు టీడీపీలో. అయితే 2014లో మాత్రం కాపులకు ఒకరికి బీసీలకు మరొకరికి ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చినా ఆ పదవి కోసం ఎదురుచూసిన బిగ్ షాట్స్ కి దక్కలేదు. తన మాట వినే వారికే ఇచ్చారు అని ప్రచారం సాగింది. వీటికి భిన్నంగా పవన్ కళ్యాణ్ కి ఉప ముఖ్యమంత్రి పదవిని బాబు ఇచ్చారు. అలా ఇవ్వరనే అంతా అనుకున్నారు మాజీ మంత్రి కాపు నేత చేగొండి హరి రామజోగయ్య వంటి వారు అయితే ఎన్నికల ముందే సభలలో దానికి ప్రకటించాలని కూడా కోరారు. కానీ బాబు పవన్ కి ఆ హోదా ఇవ్వడమే కాదు కీలక శాఖలు ఇచ్చారు. తనతో సమానంగా ప్రభుత్వ ఆఫీసులలో పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఉంచేలా ఆదేశాలు ఇచ్చారు. ఇవన్నీ చూసినపుడు బాబు మారారు అని అంతా అంటున్నారు. అంతే కాదు పవన్ ని నమ్మారు అని అంటున్నారు. పవన్ కూడా బాబుని నమ్మారు. ఈ ఇద్దరి నమ్మకమే కూటమి ప్రభుత్వం అని కూడా చెప్పాలి. మరి ఈ నమ్మకం ఎంతకాలం ఉంటుంది అన్న డౌట్లు అందరికీ వస్తాయి. కానీ బాబు పవన్ ల తీరు చూసిన వారు అయితే ఏ సందేహాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని అంటున్నారు. చంద్రబాబు ఈ అయిదేళ్ళూ ముఖ్యమంత్రిగా ఉంటారు. ఆయన నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేయడానికి పవన్ కూడా పూర్తి సిద్ధంగా ఉన్నారు. 2029 ఎన్నికల దాకా ఈ జోడీ కొనసాగుతుంది అన్నది రూఢీగానే అంతా చెబుతున్న మాట. ఇక్కడే బాబు దూర దృష్టి కూడా ఉంది అని అంటున్నారు. వైఎస్ జగన్ పార్టీ ఓడింది. కానీ వైసీపీ అంటే ఎవరో కాదు జగన్ మాత్రమే. ఆయన బలంగా ఉంటే చాలు తిరిగి 2029 నాటికి వైసీపీ పుంజుకుంటుంది. అర్ధ శతాబ్దం పైగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు ఈ సంగతి తెలియనిది కాదు. అందుకే ఆయన పవన్ జోడీని కంటిన్యూ చేసి తీరుతారు అని అంటున్నారు. జగన్ మాదిరిగా బాబు అతి ధీమాకు పోరు అని అంటున్నారు. 2019లో టీడీపీ ఓడిపోగానే ఆ పార్టీ పని అయిపోయింది అని జగన్ భావించడం వల్లనే ఇంతకు ఇంతా మూల్యం వైసీపీ చెల్లించాల్సి వచ్చింది అని అంటున్నారు. అదే చంద్రబాబు చూస్తున్నది 2024 ని కాదు 2029 ఎన్నికలను, ఆ ఎన్నికల్లో సైతం వైసీపీని మరోసారి ఓడిస్తే కనుక ఇక ఆ పార్టీ అన్నదే ఉండదు అన్నది బాబు మార్క్ రాజకీయ వ్యూహం అని అంటున్నారు. ఏపీలో కాపులు కమ్మలది డెడ్లీ కాంబినేషన్ అని మాజీ మంత్రి ఉండవల్లి అరుణ్ కుమార్ చెప్పకనే చెప్పారు. అదే నిజం కూడా. ఈ కాంబినేషన్ కనుక కొనసాగితే కోస్తా మొత్తం కొల్లగొడతారు. రాయలసీమలో 2029 నాటికి ఎంతో కొంత జగన్ బలం పుంజుకున్నా అధికారం దక్కనీయకుండా చేయగలుస్తారు. అందుకే బాబు పవన్ చేయి విడవరని అంటున్నారు. ఇక పవన్ కూడా ఎన్నికల సభల్లో చాలా సార్లు చెప్పారు టీడీపీ జనసేన పొత్తు పదేళ్ల పాటు కొనసాగాలని. దాని అర్ధం ఆయన కూడా బాబుతోనే ఉంటాను అని చెప్పినట్లే అంటున్నారు. 2029 లో మరోసారి కూటమి గెలిస్తే అపుడు పవన్ లోకేష్ ల మధ్య ముఖ్యమంత్రి పదవుల విషయంలో పంపకం ఉండొచ్చు. ఏపీలో మూడో పార్టీని లేకుండా చేయాలన్న ఏకైక లక్ష్యంతో బాబు పవన్ కదులుతున్న వేళ వైసీపీకి ఇది అత్యంత కఠిన పరీక్ష అని చెప్పక తప్పదు.



# రేవంత్ నంబర్ వన్ !



మొదటి పేజి తరువాయి

దేశ విదేశాల్లో ఎక్కడికైనా వెళ్లే వెసులుబాటు ఉంటుంది. దేశంలోని అనేక రాష్ట్రాలు తమ సొంత ప్రభుత్వ విమానాలు, హెలికాప్టర్లను కలిగి ఉన్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్‌తో పాటు పలువురు మంత్రులు కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఎవరికైనా ఉపయోగించుకోవచ్చు. కానీ సాధారణంగా ముఖ్యమంత్రి సమయాన్ని ఆదా చేయడానికి, రహదారి-రైల్వే భద్రతకు సంబంధించిన సమస్యలను అధిగమించడానికి తక్కువ దూర ప్రయాణాలకు కూడా హెలికాప్టర్లను వినియోగిస్తారు. రాష్ట్రం నుండి బయటకు వెళ్లడానికి విమానాలను ఉపయోగిస్తారు. రాష్ట్రానికి ఎన్నికైన ముఖ్యమంత్రి అనేక ప్రత్యేక అధికారాలను కలిగి ఉంటారు. త్రిపుర ముఖ్యమంత్రికి దేశంలోనే అత్యల్ప జీతం రూ.1.05 లక్షలు పొందుతుండగా, తెలంగాణ ముఖ్యమంత్రి అత్యధికంగా రూ.4.10 లక్షల వేతనం అందుకుంటున్నారు. తెలంగాణ తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రికి రూ.3.90 లక్షలు మూడవ స్థానంలో యూపీ ముఖ్యమంత్రి వేతనం కింద రూ.3.60 లక్షలు తీసుకుంటున్నారు.

రాష్ట్రాల వారీగా ఏ సీఎంకు ఎంత జీతం...?

తెలంగాణ ముఖ్యమంత్రి -రూ.4,10,000, ఢిల్లీ ముఖ్యమంత్రి - రూ.3,90,000 ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి - రూ.3,65,000,మహారాష్ట్ర ముఖ్యమంత్రి -రూ.3,40,000, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి -రూ.3,35,000, గుజరాత్ ముఖ్యమంత్రి - రూ.3,21,000, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి -రూ.3.10,000 ,హర్యానా ముఖ్యమంత్రి -రూ.2,88,000, జారండ్ ముఖ్యమంత్రి - రూ.2,55,000, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి- రూ.2,30,000, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి -రూ.2,30,000, పంజాబ్ ముఖ్యమంత్రి- రూ.2,30,000, గోవా ముఖ్యమంత్రి - రూ.2,20,000, బీహార్ ముఖ్యమంత్రి - రూ.2,15,000, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి - రూ.2,10,000,తమిళనాడు ముఖ్యమంత్రి - రూ.2,05,000, కర్ణాటక ముఖ్యమంత్రి - రూ.2,00,000, సిక్కిం ముఖ్యమంత్రి - రూ.1,90,000, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి - రూ.1,75,000, ఒడిషా ముఖ్యమంత్రి - రూ.1,60,000, రాజస్థాన్ ముఖ్యమంత్రి - రూ.1,75,000, కేరళ ముఖ్యమంత్రి - రూ.1,85,000, అస్సాం ముఖ్యమంత్రి - రూ.1,25,000, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి - రూ.1,33,000, మేఘాలయ ముఖ్యమంత్రి రూ.1,50,000.

# ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు పవన్ కళ్యాణ్ తొలి లేఖ!

మొదటి పేజి తరువాయి

గ్రామానికి వెళ్ళాను. ఆ గ్రామ ఆడపడుచులు గుక్కెడు నీళ్ళ కోసం తాము పడుతున్న అవస్థలను చెబుతూ, అక్కడి బావిలో కలుషితమైపోయిన నీటిని చూపించారు. ఆ ప్రాంతంలోనే తోటవలస గ్రామానికి వెళ్లినప్పుడు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆ ఊరివాళ్ళు వివరించారు. గోదావరి జిల్లాలకు వెళ్లినప్పుడు పలు మత్యకార గ్రామాలవాసులు తాగు నీటి కోసం ఎన్ని ప్రయాసలుపడుతున్నామో చెప్పారు. గ్రామీణ అభివృద్ధి - దేశాభివృద్ధి అనే నినాదం నామమాత్రంగా మిగిలిపోవడాన్ని గమనించాను. గుక్కెడు మంచి నీరు కోసం మైళ్ళ దూరం వెళ్లి ప్రయాసతో బిందెడు నీరు తెచ్చుకుంటున్న ఆడపడుచుల అవస్థలు చూసాను. కాలుష్యమయమైన జల వనరులనే తాగు నీరుగా తప్పని పరిస్థితులలో వాడుకుంటున్న పల్లెవాసులను గమనించాను.గతేడాది గ్రామ సర్పంచులతో జనసేన కేంద్ర కార్యాలయంలో చర్చాగోష్టి నిర్వహించాము. పార్టీలకు అతీతంగా వందలమంది సర్పంచులు పాల్గొన్నారు. నాటి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల నిధులను ఏ విధంగా మళ్లించేసిందీ వివరిస్తూ తాము నిధులు, అధికారాలు లేక ఏ విధంగా చేష్టలుడిగిపోయి ఉన్నామో చెప్పారు. స్థానిక సంస్థల చట్టాలు, విధులు, నిధుల వినియోగంపై సాధికారత కలిగిన చెల్లప్ప, డా.ఈడిగ వెంకటేష్ లాంటి మేధావులు, ఆచార్యులతో కూడా ఆ రోజు చర్చించాము. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జల్ జీవన్ మిషన్ ద్వారా పల్లెలకు రక్షిత తాగు నీరు అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తాను.పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం' అనేది జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటి అని ప్రతి ఒక్కరికీ తెలుసు. ఒక పక్క పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరగాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందాలి అని నేను గట్టిగా కోరుకుంటున్నాను. అయితే ఆ అభివృద్ధి పర్యావరణానికి హితంగా జరగాలి. ఆధునిక సాంకేతికత మేళవించిన సురక్షితమైన పారిశ్రామిక అభివృద్ధి ఈ సమాజానికి అవసరం. విశాఖ ఎల్.జి. పాలిమర్స్ ప్రమాదాన్ని మనం ఏనాడూ మరచిపోలేము. ప్రజల ఆరోగ్యాలను హరించివేయకుండా పరిశ్రమలు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకునేలా పరిశ్రమలు ముందుకు వెళ్ళడానికి చేయూతనిస్తాము. భూ తాపాన్ని తగ్గించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న ప్రయత్నాలకు బాసటగా నిలుస్తాము. గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకునేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తాము.వృక్షో



రక్షతి రక్షితః అనే సూక్తి నా మదిలో ఎప్పుడూ మారుమోగుతుంటుంది. ఒక్క వృక్షాన్ని రక్షించుకుంటేనే మానవ కోటికి ఎంతో మేలు కలుగుతున్నప్పుడు.. మరి లక్షలాది వృక్షాలను తన గర్భాన నిలుపుకున్న అడవి తల్లిని కంటికి రెప్పలా కాపాడుకుంటే ఎంతో మేలు కలుగుతుంది. అడవుల విధ్వంసమే కరువు కాటకాలకు హేతువు. అటువంటి అడవులను కంటికి రెప్పలా కాపాడతాము. ఎర్రచందనం, అటవీ సంపద అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతాము. అడవుల వినాశనానికి పాల్పడినా, ప్రయత్నించినా ఎంతటి వారైనా సరే కటకటాల వెనక్కు వెళ్ళవలసిందే. సామాజిక వనాలను పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తీర ప్రాంతాల్లో మడ అడవుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. శాస్త్ర, సాంకేతిక విభాగాలు మానవాళి శ్రేయస్సుకు, లోక కళ్యాణానికి అత్యంత అవశ్యం.అదే విధంగా జనసేన పార్టీ నుంచి మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించబోయే నాదెండ్ల మనోహర్ , కందుల దుర్గేష్ కు ప్రజా ప్రయోజనం కలిగిన, అభివృద్ధి సంబంధిత శాఖలు అప్పగించారు. పౌరసరఫరాలు, టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖలు కేటాయించడం సంతోషంగా ఉంది. నాదెండ్ల మనోహర్ నిర్వర్తించే ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాము. ప్రజా పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేస్తాము. రేషన్ కార్డుదార్లకు నిత్యావసరాలు పంపిణీపై ప్రత్యేక దృష్టిపెడతాము. అదే విధంగా రైతుల నుంచి పంటల కొనుగోలు విధానం, వారికి సొమ్ములు చెల్లించడంలో మెరుగైన విధానాలు అవలంబిస్తాము. రాష్ట్రంలో వరి రైతులకు పంట కొనుగోలు డబ్బులు అందించడంలో గత ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్య పోకడలు, రైతుల వేదనలు స్వయంగా చూశాను. ఆ పరిస్థితులు రానీయము.రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి జరిగితే ఉపాధి అవకాశాలు చాలా పెరుగుతాయి. ఆహ్లాదకర పర్యాటకంతోపాటు, ధార్మిక, భక్తి పర్యాటకం అభివృద్ధిపై దృష్టి పెడతాము. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. పర్యాటక కేంద్రాలలో మెరుగైన వసతులు కల్పించడంతోపాటు రాష్ట్రానికి ఒక బ్రాండ్ కల్పించడంపై దృష్టిపెట్టాలి. అదే విధంగా సినిమా రంగానికి రాష్ట్రంలో ప్రోత్సాహకరం, స్నేహపూరిత వాతావరణం తీసుకువస్తాము. చిత్రీకరణ ప్రాంతాలలో సినీ పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ఈ రంగంలో రాష్ట్ర యువతకు ఉపాధి దక్కేలా చూస్తాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుగావడానికి ఎనలేని సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి, ప్రజలతో నేరుగా సంబంధ భాందవ్యాలు కలిగిన మంత్రిత్వ శాఖలు కేటాయించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. జనసేన పార్టీకి కేటాయించిన శాఖల ద్వారా చిత్తశుద్ధితో ప్రజా సేవలు అందిస్తాము. నేను నిర్వర్తించబోయే శాఖలపై మరింత లోతైన అధ్యయనం జరిపి ప్రజలకు అత్యంత మేలైన ఫలాలను అందించడానికి శక్తి వంచన లేని కృషి చేస్తానని అయిదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ వాసులకు సవినయంగా తెలియచేస్తున్నాను.

**(పవన్ కళ్యాణ్)**

**ఉప ముఖ్యమంత్రి**

**పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి**

**పర్యావరణం, అటవీ శాఖల మంత్రి**

# ఓఆర్ఆర్ యూనిట్‌గా విపత్తు నిర్వహణ

మొదటి పేజి తరువాయి

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ఈ సందర్భంగా అధికారులకు సూచనలు చేశారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న సీసీ కెమెరాలన్నింటినీ వీలైనంత త్వరగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. వానల వల్ల తలెత్తే సమస్యల పట్ల అత్యవసర పరిస్థితుల్లో స్పందించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ఎలాంటి చర్య లు తీసుకుంటున్నారనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిజికల్ పోలీసింగ్ విధా నం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్య లు చరపట్టాలని సూచించారు. ఎఫ్ఎం రేడియో ద్వారా ట్రాఫిక్ అలర్ట్స్ హైదరాబాద్ ప్రజలకు అందించేలా ఏర్పాటు



చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది కొరత లేకుండా హోమ్ గార్డుల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని కూడా ఆదేశించారు. జంటనగరాల్లో ఇప్పటికే వరద తీవ్ర త ఎక్కువగా ఉండే 141 ప్రాంతాలను గుర్తించామ ని, వరద నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని అధికారులు సీఎంకు వివరించారు. నీరు వచ్చి చేరే ప్రాంతాల నుంచి వరద నీరు వెళ్లేలా వాటర్ హార్వెస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

## జిల్లా నూతన కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన దివాకర టి.ఎస్

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేస్తా.



ఏటూరునాగారం(ములుగు)(**గౌతమ్ న్యూస్ ):** ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు.



ఆదివారం కలెక్టర్ ఛాంబర్ లో నూతన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు జిల్లా అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో దివాకర్ టిఎస్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి , ఆర్డీవో సత్యపాల్ రెడ్డి కలెక్టర్ కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హులైన లబ్ది దారునికి అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. త్వరలో శాఖలు వారిగా సమీక్ష నిర్వహిస్తానని , జిల్లా అధికారుల సమన్వయంతో ములుగు జిల్లాలో అభివృద్ధి లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా లోని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాట్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడానికి కృషి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజకుమార్, డిపిఆర్ఓ ఎండి రఫీక్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి. పాటిల్ ఐఏఎస్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం కలెక్టరేట్ : ఆదివారం జిల్లా కలెక్టర్ గా ఉదయం 10 :15 నిమిషాలకు ఐ డి ఓ సి లో తన ఛాంబర్ లో తొలి సంతకం చేసి నూతన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలను జితేష్ వి. పాటిల్ స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మరియు అన్ని శాఖల జిల్లా అధికారులు పుష్పగుచ్చం అందించి కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలెక్టర్ గా పని చేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అందరినీ సమన్వయం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 23న కొత్తగూడెంలో అంతర్జాతీయ "ఒలంపిక్ డే రన్ "

ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మహీధర్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (**గౌతమ్ న్యూస్ ):** భద్రాద్రి కొత్తగుడెం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అద్వర్యం లో ఈ నెల 23 వ తేదీ ఆంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భము గా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ బద్రాద్రి కొత్తగుడెం జిల్లా లో ఈ నెల 20 వ తేదీ అశ్వారావుపేట నియోజక వర్గం దమ్మపేట లో ఉదయం 7.00 గంటల కు ప్రారంభమైన ఒలింపిక్ డే రన్ 21 వ తేదీ భద్రచలం ఉదయం 7.00 చేరుకొని సాయంత్రం మణుగురు మీదిగా 22 తేదీ ఉదయం 7.00 గంటలకు ఇల్లందు చేరుకుంటుందని చివరిగా 23 వ తేదీ ఉదయం 7.00 గంటలకు కొత్తగుడెం లో స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు "ఒలింపిక్ డే రన్ " ప్రకాశం స్టేడియం నుండి ప్రారంభిస్తారని బద్రాద్రి కొత్తగుడెం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె.మహిధర్ తెలిపారు .ఈ సందర్భముగా జిల్లా లోని అన్ని నియోజక వర్గాల నుండి ఒలింపిక్ స్ఫూర్తి ని నింపుతూ క్రీడా జ్యోతి ప్రయాణిస్తుంది ని మరియు రాన్నున్న పారిస్ ఒలింపిక్స్ లో భారత్ ఆథ్లెట్లు కు ఉత్సహాన్ని ఇవ్వాలని కొరారు ,కావున జిల్లా లోని క్రిడాకారులు ,క్రీడాభిమానులు ,క్రీడాసంఘాల బాద్యులు ఈ ఒలింపిక్ డే రన్ లో ఫల్గుని తమ ఒలింపిక్ క్రీడా స్పూర్తిని చాటాలని మహిధర్ కొరారు .

## ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షునిగా ధారా రమేష్ ఎన్నిక



అన్నపురెడ్డిపల్లి(**గౌతమ్ న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షునిగా ధారా రమేష్ ఎన్నికయ్యారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో సమీప ప్రత్యతిపై మెజార్టీ ఓట్లు సాధించి జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షునికి ఆర్యవైశ్య సంఘం చంద్రుగొండ మండల అధ్యక్షుడు పసుమర్తి శేషగిరిరావు, ధారా వెంకటేశ్వరరావు,సంకా కృపాకర్, కొదుమూరి సత్యనారాయణ, లు అభినందనలు తెలియజేశారు.

## సాయికుమార్ చదువు బాధ్యత నాదే..

చక్రుతండా మాజీ సర్పంచ్ మంగా బాలాజీనాయక్



మహబూబాబాద్ బ్యూరో(**గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని చక్రుతండా గ్రామానికి చెందిన అజ్మీర మల్లానాయక్ కుమారుడు సాయికుమార్ చదువు బాధ్యత నాదేనని ఆ గ్రామ మాజీ సర్పంచ్ బానోతు మంగా బాలాజీనాయక్ అన్నారు. రెండ్రోజుల క్రితం మల్లనాయక్ మృతిచెందగా అతడి కటుంబాన్ని ఆదివారం మాజీ సర్పంచ్ పరామర్శించారు. శోకసంద్రంలో మునిగి ఉన్న కుటుంబానికి ధైర్యాన్నిచ్చారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో



ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నది. మల్లనాయక్ కు వృద్ధురాలైన తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో బాలాజీనాయక్ నేనున్నానంటూ ముందుకొచ్చి మల్లనాయక్ కుమారుడు సాయికుమార్ చదువుకు అయ్యే స్కూల్ ఫీజును రెండేళ్ల వరకు భరిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సాయికుమార్ 4వ తరగతి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు.

# కొండెక్కిన కోడి ధర!!

## లొల్లి చేస్తున్న ఉల్లి ధర!! పచ్చడికి పచ్చిమిర్చి కరువు!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్ ):** గతంలో మునుపు ఎప్పుడు లేని విధంగా కూరగాయల ధరలు అమాంతం పెరిగి ప్రజల నడ్డి విరుస్తున్నాయి, మార్కెట్లో అన్ని ధరలు



ఇంచుమించు పెరిగిపోయాయి, చికెన్ ధర విషయానికొస్తే కేజీ 300 దగ్గర ధర పలుకుతుంది, అదేవిధంగా పచ్చిమిర్చి 120 రూపాయలు చొప్పున కిలో ధర పలుకుగా, ఉల్లిగడ్డ 50 నుంచి 60 రూపాయల వరకు ధర పలకడంతో ఇంట్లో మహిళలు పెరుగుతున్న ధరలతో ఆందోళన చెందుతున్నారు, చివరకు పచ్చిమిర్చి తో పచ్చడి చేసుకోవడానికి కూడా మిర్చి ధర ఏకంగా 120 రూపాయలు పలకడం వల్ల సామాన్య ప్రజలు తో సైతం పచ్చిమిర్చికి దూరం అయిపోతున్నారు, పచ్చిమిర్చితోపాటు చికెన్ ధర కూడా 300 రూపాయలకు కేజీ చొప్పున విక్రయించడం కేజీ ఉల్లిగడ్డ 50 నుంచి 60 రూపాయల వరకు మార్కెట్లో ధర పెరిగింది, చికెన్ వంట చేయాలన్నా కూరగాయలు ఆకుకూరలు వంట చేయాలన్న ప్రతి ఇంటి వంటింటి మహిళలు తప్పకుండా ఉపయోగించే టమాటా ధర ,ఉల్లి



ధర ,పచ్చిమిర్చి ధర, పెరగడంతో వంటల్లో నిత్యం ఉపయోగించే పై వస్తువులు ఇంట్లో కనిపించకుండా పోతున్నాయి, టమాటా ధర విషయానికొస్తే 60 నుంచి 70 రూపాయల వరకు కేజీ టమాట అమ్ముతున్నారు, ధరల మీద ధరలు పెరిగినప్పటికీ ప్రజలు ఏ విధంగా బతకాలని ప్రశ్నిస్తున్నారు, ధరల పెరగడానికి ప్రధాన



కారణం మార్కెట్లో కూరగాయలు ఆకుకూరలు పంటలు నష్టపోవడం అనేక కారణాలవల్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారస్తు లంటున్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలను నియంత్రించవలసినప్పటికీ ధరల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ధరలు పెరుగుతున్నాయని ప్రజలంటున్నారు, వీటితోపాటు



ఆకుకూరల ధరలు కూడా పెరిగినవి వర్షాభావ పరిస్థితులు తోటలకు తెగుళ్లు వంటి సమస్యల వల్ల ఉత్పత్తి తగ్గి ధరలు పెరుగుతున్నాయని అయినా కూడా వ్యాపారస్తులు తమ జీవనోపాధి కోసం పెరుగుతున్న



ధరలకు అనుగుణంగా నాణ్యత లేని టమాట , పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ విక్రయిస్తూ కాలం గడుపుకుంటున్నారు, ఎక్కడ గత్యంతరం లేని సామాన్య ప్రజలతో సహితం తప్పని పరిస్థితుల లో పావు కేజీ చొప్పున కొనుగోలు చేసి నెల రోజులు గడపకుంటూ జీవిస్తున్నారు, ఇప్పటికైనా ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలకు కళ్లెం వేయాలని ప్రజలకు పరిచయం మై ఏర్పాట్లు చేయాలని, రైతు బజార్ లో మోసం లేకుండా నాణ్యతతో కూడిన కూరగాయలు ఆకుకూరలు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు,

# వనపర్తి జిల్లాలో వీధి కుక్కల వీరంగం!!

## మనుషులతో పాటు మూగజీవాలపై దాడి!! పట్టించుకోని అధికార ఘనం!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్ ):** వనపర్తి జిల్లాలోని వివిధ మండలాలలో గ్రామాలలో వీధి కుక్కల వీరంగం రోజు రోజుకు అంతులేకుండా వీరంగం చేస్తున్నాయని ప్రజలు ఆందోళన చేస్తున్నారు, గత వారం రోజుల క్రితం వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన గంధం పర్ల బుచ్చమ్మ మేకల షెడ్డులో మీది కుక్కలు ప్రవేశించి 9 మేకలను ప్రాణాలు తీశాయి, ఇది ఇలా ఉండగా పెద్దమందడి మండలం జగత్ పల్లి గ్రామానికి చెందిన రాముడు ,మల్లేష్ అనే వ్యక్తులకు చెందిన గొర్రె



పిల్లలను కంచె ఏర్పాటుచేసి చుట్టుముట్టు రక్షణ కవచంగా వైర్లతో కంచ ఏర్పాటు చేసినప్పటికీ అందులో ఉన్న 30 గొర్రె పిల్లలను వీధి కుక్కలు రణరంగం చేసి ప్రాణాలు తీయడంతో రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు, ఈ విధంగా వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రతి వార్డుల్లో కూడా వీధి కుక్కలు పట్టపగలు రాత్రి తేడా లేకుండా సైర్వ విహారం, చేస్తూ మనుషులతో పాటు మూగజీవాలైన గొర్రెలు మేకలను ప్రాణాలు తీస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు, మీది కుక్కలతో పాటు కొంతమంది ఇంటి యజమానులు కూడా పెంపుడు కుక్కలను పెంచుకున్నప్పటికీ పెంపుడు కుక్కలు కూడా మనసులను కరుస్తున్నాయని పెంపుడు కుక్కలకు ఇంజక్షన్ వేసినప్పటికీ మనసులపై దాడి దాడి చేస్తూ గాయాలకు గురి చేస్తున్నాయని ప్రజలంటున్నారు, గతంలో హైదరాబాదు నగరంలో వీధి కుక్కల వీరంగానికి చిన్నారులు పట్టపగలు ప్రాణాలు పలికి ఉన్న విషయం



పైన అప్పట్లో ప్రభుత్వం స్పందించి ఆగ మేఘాలమీద వీధి కుక్కల కోసం వేటాడి వెంటాడి అటవీ ప్రాంతాలకు తరలించినప్పటికీ మళ్లీ కథ మొదటికు వచ్చిందని ప్రజలంటున్నారు, ప్రభుత్వ యంత్రాంగం ఆ పూటకు స్పందించడం మళ్ళీ సమస్య వచ్చినప్పుడు గుర్తు చేసుకోవడం మూలంగానే ఇది కుక్కల సమస్య అధికమవుతుందని ప్రజలంటున్నారు, వీధి కుక్కల నిర్మూలన కోసం ప్రతి మండల



కేంద్రంలో గర్భనిరోధక కేంద్రాలు ఏర్పాటు చేసి కుక్కలు గర్భం దాల్చకుండా నియంత్రణ చికిత్సలు చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గిరిజన తండాలలో ఇది కుక్కల సమస్య అధికంగా ఉందని మనుషుల మధ్యన నిత్యం వీధి కుక్కలు జీవిస్తుంటాయని ఇలాంటి ఆహారం తీసుకొని వీధి కుక్కలు మనుషులు తీసుకునే ఆహారాన్ని మాత్రమే తింటాయి, ఇతర జంతువుల లాగా కుక్కలు ఏ ఇతర పదార్థాలు ముట్టుకోవు కేవలం ఆహార పదార్థాలు మాత్రమే తింటూ జీవిస్తుంటాయి, అటవీశాఖ



అధికారులతో పాటు పశుసంవర్తక శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల వీధి కుక్కల పట్ల శ్రద్ధ చూపకపోవడం ఎంతోమంది ఇది కుక్కల కాటుకు రేబిస్ వ్యాధి తో ప్రాణాలు గాలిలోకి వదులుతున్నారని ప్రజలు తల్లడిల్లి పోతున్నారు, రాష్ట్రవ్యాప్తంగా కుక్క కాటుకు సంవత్సరం వందల సంఖ్యలో ప్రాణాలు పోతున్నాయని ఈ విషయం లెక్కలు ప్రభుత్వ అధికార యంత్రాంగం దగ్గర ఉండకపోవడం కుక్కల సంఖ్య కూడా సంబంధిత శాఖ మున్సిపల్ శాఖ అధికారులకు లెక్కలు గెలవడం లేదని విమర్శలు వస్తున్నాయి, కుక్కలను చంపడం నేరమైనప్పటికీ అటవీశాఖ అధికారులు ముక్కలను పట్టుకొని జనసంచారం లేని అటవీ ప్రాంతాలలో వదిలిపెట్టాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, వీధి కుక్కల కోసం జిల్లా కలెక్టర్కు, మున్సిపల్ శాఖ అధికారులకు, గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శులకు ప్రజలు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం శూన్యం వీధి కుక్కల బాధ్యత ఎవరిదని ప్రశ్నలు వస్తున్నాయి, కుక్కల సైర్వ విహారం వల్ల చిన్న పిల్లలు బయటకు వెళ్లకుండా భయభ్రాంతులకు గురవుతున్నారని కిరణం షాపుల్లో కి ఇంటి దగ్గరలో పక్క ఇంటి వాళ్ళ ఇంటికి చిన్నపిల్లలు వెళ్లాలంటే కూడా కుక్కల భయానికి ఇండ్ల నుంచి బయటికి రాలేకపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు, వీధి కుక్కలు మనుషులతో పాటు చివరకు అభం శుభం తెలియని మూగ జీవులు మేకలు గొర్రెలు, కోళ్లు ను చంపుతున్నాయని తక్షణమే ప్రభుత్వం వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని గర్భం దాల్చకుండా చికిత్స అందజేయాలని అప్పుడే వీధి కుక్కల బారిన పడకుండా ఉండే అవకాశాలు ఉంటాయని పలువురు అంటున్నారు, వనపర్తి లో ఈ మధ్యకాలంలో జరుగుతున్న వీధి కుక్కల పట్ల ఇప్పటివరకు జిల్లా అధికార యంత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తక్షణమే వీధి కుక్కల భారీ నుంచి కాపాడాలని గొర్రె కాపర్ల యజమానులు వివిధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు,

## ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు

# త్యాగానికి ప్రతీక ఈదుల్ అజ్ హా

మెట్పల్లి(**గౌతమ్ న్యూస్ ):** త్యాగానికి, దేవుని పై బాక్తి కి బక్రీద్ పండుగ తార్కాణంగా నిలుస్తోంది. అల్లాహ్ ఆదేశం ప్రకారం ఇబ్రహీం ప్రవక్త తన కుమారు డైన ఇస్మాయిల్ ను (ఖుర్బానీ ) బలి



తీసుకెళ్లే సాంప్రదాయాన్ని స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగన జరుపుకుంటారు. ఇస్లాంలోని ఐదు ప్రధాన నూ ఒకటైన హజ్ తీర్థయాత్రను ముస్లింలు చేయవలసి ఉంటుంది. ఈ నెల ప్రారంభంలోనే ముస్లిం ప్రజలు భక్తి ప్రపత్తులతో హజ్ తీర్థయాత్రకు బయలుదేరుతారు. హజ్ యాత్రకొరకు సౌది అరేబియాలోని మక్కా నగరానికి చేరుకుని మసీద్ ఉల్ హరామ్ ఉన్న కాబా చుట్టూ వీరు ప్రదక్షిణ లు చేసి మసీదులో ప్రార్థనలు చేస్తారు. ప్రపంచం లోని ముస్లింలందురూ కాబా వైపు తిరిగి నమాజు చేస్తారు. దీనినే (ఖిబ్ల )అని కుడా అంటారు. అల్లాహ్ ఆదేశానుసారం ఇబ్రహీం తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్ ను బలి ఇవ్వటానికి సిద్ధమవుతారు సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈ బక్రీద్ పండుగను జరుపుకుంటారు.

### ముస్లిం సోదరుల సామూహిక

ఈద్ ఉల్ అజ్హా (బక్రీద్) ప్రార్థనలు ఈద్గాహ్ ముగిసిన తర్వాత ఇండ్లకు వచ్చిన ముస్లింలు ఖుర్బానీ ద్వారా అల్లాహ్ పై విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ జంతు బలిదానాలు చేస్తారు. ఆ మాంసాన్ని మూడింట ఒక వంతు పేదలకు పంచాలి. మిగిలిన రెండు భాగాల్లో ఓ భాగం సొంతానికి, మరో భాగం ఇరుగుపొరుగు వాళ్లకు, బంధువులకు పంపిణీ చేస్తారు. ఖుర్బానీ మాంసాన్ని ఇతర మతాల వారికి కూడా పంచుతారు. ఇలా చేయడం ద్వారా మానవులంతా ఒకటేనన్న ఇస్లాం



క్యాలెండర్లో ధు ల్ హిజ్జః మాసం 10రోజున ఈదుల్ ఉల్ ఆధా ' (బక్రీద్)ను నిర్వహి స్తారు.ఒక మహోన్నత త్యాగానికి గుర్తుగా ఈ పండుగను ముస్లింలు జరుపుకొంటారని, అదే ఇబ్రహీమ్ ఇస్మాయీ త్యాగమని, దైవా ను పొందిన ఇబ్రహీమ్ తన ఏకైక సంతానమైన ఇస్మాయీలు దైవ ప్రసన్నత కోసం బలి ఇవ్వ దానికి సిద్ధపడతాడని తెలిపారు. అది 'దైవాజ్ఞ' అని తెలుసుకున్న ఇస్మాయీల్ కత్తి కింద ధస్సును సంతోషంగా పెదతాడని ఈ అనుపమా సమైన అల్యమైన త్యాగానికి గుర్తుగా ప్రాణాలను అల్లాహ్ మార్గంలో త్యాగం చేయ దానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని ఖుర్బనీ ద్వారా ముస్లింలు



చాటుకారని తెలిపారు. ఒకసారి ఇబ్రహీమ్ తన ప్రియమైన కుమారుణ్ణి జిబాహ్ ) చేస్తున్నట్టు కలలో చూశారని, వెంటనే దాన్ని దైన్యగా తలచి, తన ముద్దుల కుమారుణ్ణి జిబాహ్ చేయడానికి తీసుకువెళ్ళా దని, నిర్ణీత ప్రదేశంలో, కళ్ళము వస్త్రం కట్టుకొని సౌజహ్ చేయడం ప్రారంభించారని తెలిపారు. అల్లాహ్ ప్రకట గొర్రె పోతును పంపిం వారని ఇస్మాయిల్ను ఆ గొర్రెపోతు పక్కకు ఇదిపి ఆయనస్థానంలో జిబ్ట్ అయిందన్నారు. అల్లాహ్ దైవదూతలందరినీ హాజరుపరిచి, అందుకున్న ఇబ్రహీన్ తన కుమారుణ్ణి ఆ రోజు నుంచి ప్రళయదినం వరకూ ఖుర్బానీ ని ఇస్లాంలో భాగం చేశాడని, తరువాత, ఇబ్రహీమ్ చేతుల మీదుగా తనగృహాన్ని కావాను జిల్లాల్ ఈ భూమిపై నిర్మింపజేశాడని తెలిపారు. ఆ రోజు నుంచి హజ్ యాత్రను విధిగా చేయడం జరిగిందని, ఇబ్రహీం. ఇస్మాయిల్ ఇటుకలపై ఇటుకలు పేరుస్తూ కాబా గృహాన్ని నిర్మించార సత్యంపై నిలువడం, దానికోసం ప్రాణాలను అర్పించడానికైనా వెనుకాడకపోవడం దైవాజ్ఞ కోసం కుమారుణ్ణి సైతం త్యాగం చెయ్యడానికి సిద్ధపరడం సత్యం.

# నేడే బక్రీద్ పండుగ



## ముస్లిం సోదరుల ప్రధాన పండగలు రెండు అవి ఒకటి రంజాన్ రెండు బక్రీద్

అన్నపురెడ్డిపల్లి **(గౌతమ్ న్యూస్ ):** నేడు బక్రీద్ పండుగ సందర్భంగా అన్నపురెడ్డిపల్లి మండల ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ దస్తగిర్ ను బక్రీద్ పండగ ప్రాముఖ్యత ప్రత్యేకత గురించి వివరణ కోరగా, ముస్లింల ప్రధాన పండగలు రెండు అవి ఒకటి రంజాన్ రెండ వది బక్రీద్. ఈ పండుగకు ఈదుల్.. అజహా, ఈదుజ్జహా, లేక బక్రీద్ అని కూడా అంటారు. ఇస్లామ్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిల్‌హేజ్ 10వ తేదీన బక్రీద్ పండుగను ముస్లింలు జరుపుకుంటారు. ఇస్లాం మతంలోని ఐదు ప్రధాన సూత్రాలలో ఒకటైన హజ్ తీర్థయాత్రను ముస్లింలు చేయవలసి ఉంటుంది. ఈ మాసం ప్రారంభంలోనే ముస్లిం ప్రజలు భక్తి ప్రపత్తులతో హజ్ తీర్థయాత్రకు బయలుదేరతారు.

### బక్రీద్ పండగను ఎందుకు జరుపుకుంటారు..?

హజ్ యాత్రకొరకు అరబ్ దేశమైన సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి చేరుకుని మసీద్ లో ఉన్న కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి అక్కడ ప్రార్థనలు చేస్తారు. ఈ మసీద్ కాబా గృహం చుట్టూ ఉంది. ప్రపంచంలోని ముస్లింలందరూ కాబా వైపు తిరిగి నమాజ్ ( ప్రార్థనలు ) చేస్తారు. దీనినే ఖిబ్లా అని కూడా అంటారు.హజ్ తీర్థయాత్రకు వెళ్ళినవారు మక్కా నుండి మదీనా ( ముహమ్మద్ ప్రవక్త గోరీ ఉన్ననగరం )ను సందర్శిస్తారు. అల్లాహ్ ఆదేశానుసారం ఇబ్రహీం తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధమౌతాడు. ఆ సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈ బక్రీద్ పండుగను జరుపుకుంటారు.

### హిజ్రీ అంటే ఏమిటి..?

బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే జంతువని, ఈద్ అంటే పండుగని అర్థాలు ఉన్నాయి. జంతువును ఖుర్బాని ( దానం ) ఇచ్చే పండుగ కాబట్టి దీనిని ఈదుల్ ఖుర్బాని అని కూడా అంటారు. మహ్మదీయులు సంవత్సరాన్ని హిజ్రీ అనే పేరుతో పిలుసుకుంటారు.హిజ్రీ అంటే వలసపోవడం అని అర్థం. మహ్మద్ ప్రవక్త మక్కా నుండి మదీనాకు తరలివెళ్లడాన్ని హిజ్రీగా పేర్కొంటారు. ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలన్నది ఇస్లాం మత సూత్రాలలో ఇదొకటి. త్యాగనిరతితోపాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను కూడా విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగలోని ప్రధాన పరమార్థం దాగిఉంది.

### ఖురాన్ ఏం చెబుతోంది..?

ఖురాన్ ప్రకారం.. భూమిపైకి అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఆయన మక్కా పట్టణాన్ని నిర్మించి నివాస యోగ్యంగా మార్చారు. అల్లా ఆరాధన కోసం కాబా అనే ప్రార్థనా మందిరాన్ని కూడా నిర్మించి దైవ ప్రవక్తగా ఆయన పేరుపొందాడు. ఇబ్రహీం తనకు లేకలేక పుట్టిన బిడ్డకు ఇస్మాయిల్ అని పేరు పెట్టాడు. ఓ రోజు ఇస్మాయిల్ మెడపై కత్తిపెట్టి కోస్తున్నట్టు ఇబ్రహీం కలగన్నాడు. అల్లాహ్ ఖుర్బానీ కోరుతున్నాడమోనని ఓ ఒంటెను బలిస్తాడు. అయినా, మళ్లీ అదే కల రావడంతో తన కుమారుడినే బలిదానం కోరుకుంటున్నారని భావించిన ఇస్మాయిల్ సిద్ధపడ్డాడు. ఇస్మాయిల్ మెడపై కత్తి పెట్టి జుబాహ్‌కు ఇబ్రహీం ఉద్యుక్తుడవుతుండగా అతని త్యాగానికి మెచ్చిన అల్లాహ్ దీనికి బదులుగా ఓ జీవాన్ని బలివ్వాలని జిబ్రాయిల్ అనే దూత ద్వారా కోరతాడు. అప్పటి నుంచే బక్రీద్ రోజున ఖుర్బాని ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని ముస్లిం భావిస్తున్నారు.

### ఖుర్బాని పరమార్థం ఏమిటి..?

ఖుర్బాని అంటే పేదలకు మాంసాన్ని దానం ఇవ్వడం, త్యాగం అనే అర్థాలు ఉన్నాయి. ఖుర్బాని అంటే సాన్నిధ్యం, సామీప్యం, సమర్పణ, త్యాగం అని కూడా అర్థం. అంటే దైవ సాన్నిధ్యాన్ని పొందడం. దైవానికి సమర్పించడం. దైవం కోసం త్యాగం చేయడం అని భావం. అయితే, ఖుర్బాని ద్వారా రక్త మాంసాలు సమర్పించడం కాదని, రక్తం, ఇవి అల్లాకు చేరవని, భక్తి, పారాయణత హృదయంలో జనించే త్యాగభావం, భయభక్తులు మాత్రమే ఆయనకు చేరుతాయని ముస్లింల భావన. అంతే కాదు.. ప్రాణత్యాగానికైనా వెనుకాడడని ఇదే ఖుర్బాని పరమార్థమని ముస్లిం పెద్దలు కొందరు అంటారు. మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం పేదల ప్రజలకు, రెండో భాగం తమ బంధువులకు, మరో భాగం తన కుటుంబం కోసం వినియోగిస్తారు.

### ఖుర్బానిగా కోడిపుంజును ఇవ్వరాదు

ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు బక్రీద్ రోజున ఖుర్బాని ఇస్తారు. జిల్ హజ్ నెల 11, 12 రోజుల్లో కూడా కొన్ని చోట్ల ఖుర్బాని ఇస్తూనే ఉంటారని తెలుస్తుంది. ఖుర్బానిగా సమర్పించే జంతువులకు అవయవలోపంలేని, ఆరోగ్య కరమైనవిగా ఉండాలి. ఒంటె, మేక లేదా గొర్రెను దైవమార్గంలో సమర్పించాలి. స్థోమత కలిగిన ప్రతి ముస్లిం దీనిని విధిగా ఆచరించాలి. అల్లా నియమ నిబంధనల ప్రకారం ఖుర్బానిగా కోడి పుంజును ఇవ్వరాదు. ఐదేళ్ల వయసు పై బడిన ఒంటె, రెండేళ్ల పై బడిన ఎద్దు, కనీసం ఏడాది వయసున్న మేక, గొర్రెలను బలి ఇవ్వాలి. ఖుర్బాని చేసే వ్యక్తి వడ్డీతో కూడిన అప్పులు ఇవ్వడం, తీసుకోవడం చేయరాదు. ఈ నియమాలను తప్పక పాటిస్తారు.

### బక్రీద్ పండగ రోజున మటన్ మాత్రమే

బక్రీద్ పండుగ సందర్భంగా మటన్ బిర్యానీ, మటన్ కుర్మా, మటన్ కీమా, షీర్ కుర్మా, కీర్ లాంటి వంటకాలను తయారు చేస్తారు.ఇతరత్రా వంటకాలు చేస్తారు. మృతి చెందిన వారి సమాధులను దర్శిస్తారు. సమాధులను అందంగా అలంకరిస్తారు. వారికిష్టమైన దుస్తులు, భోజనం అక్కడ ఉంచుతారు. స్వర్గంలో ఉన్న వారు వాటిని స్వీకరిస్తారని నమ్మకం. అన్ని గుణాల్లోనూ దానగుణమే ఉత్తమోత్తమమైనది. ఆకలి అనేది అందరి సమానమైనది కాబట్టి ఈ పండగకు నిరుపేద కుటుంబాలకు శక్త్యనుసారంగా దానధర్మాలు చేస్తూ కొంత కొంత మందికైన ఆకలి తీర్చగలిగాం అని సంతృప్తి చెందుతారు. ధర్మం అంటే దానగుణం ముడిపడి ఉన్నదే మానవ ధర్మం. మతం ఏదైనా మానవత్వం గొప్పది. అని వారు తెలియ పరిచారు..

## మల్లానాయక్ కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆర్థిక సాయం...!!



మహబూబాబాద్ బ్యూరో **(గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని చక్రుతండా గ్రామానికి చెందిన అజ్మీర మల్లానాయక్? రెండ్రోజుల క్రితం మృతిచెందగా ఆయన కుటుంబాన్ని చక్రుతండా మాజీ సర్పంచ్? బానోతు మంగా బాలాజీనాయక్? ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లన్న కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం.. అరక్వింటా బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్? మాట్లాడుతూ.. అందరితో కలుపుగోలుగా ఉండే మల్లన్న మృతిచెందడం కుటుంబానికి తీరని లోటని అన్నారు. తన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాగా మల్లన్నకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉండగా.. కుమారుడు సాయికుమార్? చదువుకు అవసరమయ్యే స్కూల్? ఫీజును రెండు సంవత్సరాలకు వరకు తానే భరిస్తానని బాలాజీనాయక్? హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్? బానోతు లింబానాయక్?, మాజీ వార్డు సభ్యుడు నరేశ్?, బీఆర్?ఎస్? నాయకులు బానోతు భగ్నా, బానోతు శ్రీనివాస్?, లకావతు శ్రీహరి, లకావతు సేవ, చంద్రు, గ్రామస్తులు సురేశ్?, బాలకిషన్?, ఉమ, ధర్మ, బాసు, తదితరులు పాల్గొన్నారు.

## "ఉపా "కింద అరుంధతి రాయ్ ని ప్రాసిక్యూషన్ ను అనుమతించడాన్ని ఖండించండి



### సాధినేని. వెంకటేశ్వరరావు

టేకులపల్లి **(గౌతమ్ న్యూస్ ):** ఉపా కింద ప్రముఖ రచయిత అరుంధతి రాయ్ ని ప్రాసిక్యూట్ చేయడానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్న ది. 14 సంవత్సరాల క్రితం నాటి కేసులో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఇలా అనుమతి మంజూరు చేయడం దురుద్దేశంతో కూడిన చర్య మాత్రమే!ఐపీసీ లోని 124 బి,153ఏ, 153బి,504,505,13, ఉపా వంటి తీవ్రమైన సెక్షన్ కింద ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతినివ్వడం ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతెత్తే వారిని అణిచివేయాలని బిజెపి ప్రభుత్వం భావిస్తుంది. ప్రాసిక్యూషన్కు అనుమతిని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఐ (ఏం- ఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. అలాగే ప్రముఖ విద్యావేత్త షేక్ షౌకత్ హుస్సేన్ ను 14 ఏళ్ల నాటి కేసులో ఉపా చట్టం కింద ప్రాసిక్యూషన్ చేసేందుకు అనుమతి ఇవ్వడాన్ని సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.ఇది భావ ప్రకటనా స్వేచ్ఛకు వ్యతిరేకంగా తీసుకున్న ప్రతికార చర్యగా దీన్ని ప్రజలు గుర్తించాలని పార్టీ కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. ఈ చర్యకు వ్యతిరేకంగా ప్రజలు,ప్రజాస్వామిక వాదులందరూ పెద్ద ఎత్తున కదిలి ఉద్యమించాలని సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.

## జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం : మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలి. బక్రీద్ పండుగను జిల్లా ప్రజలంతా సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు రేపు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మసీదులు,దర్గాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేసారు.బందోబస్త్ విధులకు హాజరయ్యే అధికారులకు,సిబ్బందికి దిశా నిర్దేశం చేశామన్నారు.జిల్లా వ్యాప్తంగా గత 15 రోజులుగా 07 చెక్పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టి ఆవుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు.ఆకస్మిక తనిఖీలను నిర్వర్తిస్తూ అక్రమ రవాణా జరగకుండా నివారిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలియజేశారు.జిల్లాలోని పోలీసు అధికారులు మరియు సిబ్బంది మొత్తం బక్రీద్ బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు.మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులను ప్రజలు నమ్మకూడదని తెలియజేశారు.ముందుగా ఎటువంటి సమాచారం తెలిసినా డయల్ - 100కు ఫోన్ చేసి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లలో తెలియజేయాలని కోరారు.ఎవరైనా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే వారిపై చట్టం పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన చందాయిపేట తాజా మాజీ సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్....

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ....

అల్లా దయతో తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలి.....

స్వర్ణలత భాగ్యరాజ్.....



మెదక్,**(గౌతమ్ న్యూస్ ):** ఈద్- అల్- అదా (బక్రీద్) పండుగ సందర్భంగా మెదక్ జిల్లా చేగుంట మండలం చందాయిపేట తాజా మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ ముస్లిం సోదర సోదరీ మణులకు శుభాకాంక్షలు తెలిపారు . త్యాగం, సహనం ఈ పండుగ ఇచ్చే మంచి సందేశాలన్నారు. దానధర్మాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని అన్నారు. త్యాగం, సేవకు చిహ్నంగా బక్రీద్ పండుగ నిలుస్తుంది అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహెూన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపు కొంటారన్నారు. భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ పండుగ సోదర భావం,ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుంది అని అన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు. అల్లా దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని స్వర్ణలత భాగ్యరాజ్ అన్నారు.

## శ్రీ గాయత్రి టెక్నో స్కూల్లో తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు ఉచిత విద్య

ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభించిన రాజశేఖర్.





బయ్యారం**(గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని గందంపల్లి గ్రామంలో శ్రీ గాయత్రీ టెక్నో (ది ఇంగ్లీష్ మోడల్) స్కూల్ లో ఆదివారం విద్యా సంవత్సర పునఃప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్ నూతన విద్యార్థుల నమోదు ప్రవేశాల ప్రక్రియను విద్యార్థుల తల్లి,దండ్రులకు వివరించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ తమ పాఠశాల ప్రభుత్వ ఆమోదితం పొంది 1నుండి 7వ,తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన కలదని, తల్లి,తండ్రి లేని అనాధ పిల్లలకు పాఠశాలలో ఉచిత విధనభ్యసించే అవకాశం కల్పిస్తున్నామని,సుదూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థినీ,విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ వసతి సౌకర్యం కలదని,అర్హత,అంకితభావం కలిగిన అధ్యపకులచే విద్యా బోధన అందిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం సి.హెచ్ జీవిత,ఎం.రమ, జె.భువనేశ్వరి,జి.మంజుల, జె.దీపిక,ఎన్.సంధ్య,విద్యార్థులు, వారి తల్లి,దండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## రేపు హైదరాబాద్ జిల్లా లో ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్**(గౌతమ్ న్యూస్ ):** హైదరాబాద్ వాహనదారుల కు,రేపు కీలక గమనిక%౫% రేపు నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పోలీస్ అధికారులు తెలిపారు. నేడు ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్ సందర్భంగా అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. నగరంలోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వివిధ ఏర్పాట్లు చేయనున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రార్థనలు జరిగే పరిసర ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్ళి ఇస్తామన్నారు. బక్రీద్ సందర్భం గా హైదరాబాద్‌లోని పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధిం చనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే మీరాలం ఈద్ పరిసర ప్రాంతాల్లో వాహనా లను దారి మళ్లిస్తామని పోలీసులు వివరించారు. పాతబస్తీలోని పలు రహదా రులపై రాకపోకలు నిలిపివే స్తున్నట్లు, పోలీసులు తెలుపగా..పురానాపూల్, కమాటిపురా మరియు కిషన్‌బాగ్ వైపు నుండి ఈద్గా ప్రార్థనల కోసం వచ్చే వారిని మాత్రమే బహదూర్ పురా క్రాస్ రోడ్ మీదుగా ఉదయం 8:00 నుండి 11:30 వరకు అనుమతి స్తామని పోలీసులు తెలిపారు. ప్రార్థనలకు వచ్చే వారికి పార్కింగ్ సౌకర్యం కోసం జూ పార్క్, మసీదు అల్హా హెూ అక్బర్ ముందు ఏర్పా ట్లు చేసినట్లు వివరించారు. సోమవారం జూన్ 17,న ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం పాత బస్తీలో సుమారు 1000 మంది పోలీసులను మోహరి స్తున్నట్లు వారు తెలిపారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న మీరాలం ఈద్ సందర్భంగా ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయనున్నారు. ఇంకా, ఈ ప్రార్థనలకు 30,000 మందికి పైగా ముస్లిం సోదరులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## అనారోగ్య సమస్యతో బాధపడుతున్నా మారబోయిన శ్రీనివాస్ కు ఆర్థిక సహాయం అందించిన జనత ట్రస్ట్



ఖానాపురం**(గౌతమ్ న్యూస్ ):** ఖానాపురం మండలం మంగళవారిపేట గ్రామానికి చెందిన మారబోయిన శ్రీనివాస్ దాదాపు నెల రోజులుగా అనారోగ్య సమస్యతో యశోద హాస్పిటల్ చేరగా , అతని ఆరోగ్య బిల్లు ఎక్కువగా అయినవి. వారి కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి అంతగా లేకపోవడంతో వారి గ్రామ పెద్దలు మరియు యువకుల ద్వారా వారి కుటుంబ సభ్యులు వరంగల్ జిల్లా బీజేపీ నాయకులు డాాఎ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి గారినీ కలిసి విషయం చెప్పగా వెంటనే స్పందించారు. రాణా ప్రతాప్ రెడ్డి మరియు వారి మిత్ర బృందంతో(జనత ట్రస్ట్)లి కలిసి రూ 26,000 జమ చేసి ఈ రోజు వారి నివాసానికి మిత్ర బృందంతో కలిసి వెళ్లి శ్రీనివాస్ ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపి , ఆర్థిక సహాయం అందచేసారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం మండల బీజేపీ అధ్యక్షులు ఆబోతు రాజు యాదవ్ , ప్రధాన కార్యదర్శి జల్లి మధు గారు, ఖానాపురం మండల నాయకులు రజినీకాంత్ రెడ్డి , హరి , అశోక్ , నర్సంపేట పట్టణ బిజెవైఎం అధ్యక్షులు అచ్చ దయాకర్ , నర్సంపేట మండల బిజెవైఎం అధ్యక్షులు ఆముదాల రమేష్ , బానోత్ రాజేందర్ , కళ్యాణి ,కిరణ్ , శ్యామ్ ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే బ్రిడ్జి పూర్తి



జమ్మూ - కాశ్మీర్**(గౌతమ్ న్యూస్ ):** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వేబ్రిడ్జి నిర్మాణం దాదాపు పూర్తయింది. అతి త్వరలో బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. జమ్మూ కశ్మీర్‌లోని చీనాబ్ నదిపై ఈ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ వంతెనపై రాంబన్ నుంచి రియాసికి రైలు సర్వీస్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని ఉత్తర రైల్వేశాఖ వెల్లడించింది. ప్రస్తుతం కన్యాకుమారి నుంచి కత్రా, కశ్మీర్ లోయలోని బారాముల్లా నుంచి సంగల్దాన్ వరకు రైల్వే సేవలు కొనసాగుతున్నాయి. చినాబ్ నదీ గర్భం నుండి 359 మీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ వంతెన పొడవు 1315 మీటర్లు. ప్రపంచంలో ఎత్తైన ఈఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తులో ఈ వంతెన నిర్మించబడింది.

## తెలంగాణ ప్రజలకు ఫాదర్స్ డే శుభాకాంక్షలు చెప్పిన



హైదరాబాద్ **(గౌతమ్ న్యూస్ ):** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మంత్రి సీతక్క ఈరోజు ఫాదర్స్ డే శభాకాంక్షలు చెప్పారు. మనల్ని లాలిస్తూ పాలిస్తూ ఆలనా పాలన చుసే అనురాగ శీలి..నాన్న అంటూ ట్వీట్ చేశారు. అడుగడుగునా మన తప్పటడుగులను సర్దితే గురుశీలి నాన్న అని గుర్తు గుర్తు చేశారు.. మన సంతోషాలు బాధలను పంచుకునే స్నేహశీలి నాన్న...మన ఉన్నతిని కాంక్షించే నిస్వార్థశీలి నాన్న. అంటూ తన తండ్రితో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేశారు.

## మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన ప్రముఖ సంఘ సేవకులు

శివంపేట్ జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా



నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్ ):** శివంపేట్ మండలంలోని వెంకయతాండ లోని బాణావత్ నర్సింగ్ వాళ్ళ భార్య అనారోగ్యం బాగాలేక మృతి చెందడం జరిగింది ఆ కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖ సంఘ సేవకుడు శివంపేట జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా అలాగే వారి సొంత నిధుల నుండి 5000 వేల రూపాయలు మరియు ఒక నెలకు సరిపడా నిత్యవసర సరుకులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ రంగీలా అంజనేయులు తాజా మాజీ వార్డు సభ్యుడు శ్రీను గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్,బిఆర్ఎస్ నాయకులు హనుమంతు, బాలు, బాల్ సింగ్,ఫుల్ సింగ్ తాండవాసులు తదితరులు పాల్గొన్నారు

### హాస్పిటల్ ఖర్చు నిమిత్తం ఆర్థిక సాయం చేసిన

## ప్రముఖ సంఘ సేవకులు

### శివంపేట్ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా



నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్ ):** శివంపేట్ మండల కేంద్రంలోని కుంట మహేష్ కు కాలు ఫ్యాక్చర్ కావడంతో వారి కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖ సంఘ సేవకుడు శివంపేట్ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా అలాగే వారి సొంత నిధుల నుండి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది అలాగే జడ్పిటిసి మాట్లాడుతూ వారి కుటుంబాన్ని ఎల్లవేళలా ఆదుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్ తాజా మాజీ ఉప సర్పంచ్ పద్మా వెంకటేష్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముద్దగాళ్ల లక్ష్మీనరసయ్య తాజా మాజీ వార్డు సభ్యులు వంజరి కొండల్ బసంపల్లి పోచ గౌడ్ కుంట రాజు మరియు టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాసంపల్లి రామా గౌడ్ కుంట లింగం, కర్రె రాజు, పోచయ్య, పెద్ద కోల ప్రవీణ్, జగదీష్,కర్రె కృష్ణ కుంట నవీన్ భాను,కే .వంశి అలాగే పీఎంజి యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## హన్మకొండ నూతన కలెక్టర్ గా ప్రావీణ్య



హనుమకొండ**(గౌతమ్ న్యూస్ ):** హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పి. ప్రావీణ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సముదాయ భవనానికి చేరుకోగా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, డిఆర్ఓ ఘన స్వాగతం పలికారు. గత కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్థానంలో ప్రావీణ్య బాధ్యతలు చేపట్టారు. గతంలో వీరు వరంగల్ కలెక్టర్ గా పనిచేశారు.

## వరంగల్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సత్య శారదా దేవి



హనుమకొండ(గౌతమ్ న్యూస్ ): వరంగల్ నూతన కలెక్టర్ గా సత్య శారదా దేవి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని ఉన్న అధికారులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన కలెక్టర్ ప్రావీణ్య హనుమకొండ కలెక్టర్ గా బదిలీ అయ్యారు.

## 'నీట్'పేపర్ లీక్' . స్పందించిన కేంద్ర మంత్రి



దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ ప్రవేశ పరీక్ష 2024లో అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. నీట్ పేపర్ లీక్‌పై వస్తోన్న ఆరోపణలు దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ క్రమంలో నీట్'పేపర్ లీక్ వ్యవహారం పై మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. ఒకవేళ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులది తప్పని తేలితే వదిలేది లేదని కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు.ఆదివారం(జూన్16) ఒడిశాలోని సంబల్‌పూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పేపర్‌లీక్‌కు సంబంధించి 2 చోట్ల అక్రమాలు వెలుగుచూశాయి. ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందని పేరెంట్స్, తల్లిదండ్రులకు హామీ ఇస్తున్నా. ఇందులో ఎంత పెద్దస్థాయి అధికారులున్నప్పటికీ వదిలేది లేదు అని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో చాలా మార్పులు చేయాల్సి ఉంది. బిహార్ ఆర్థిక నేరాల విభాగం 9 మంది నీట్ అభ్యర్థులకు పేపర్‌లీక్ కేసులో నోటీసులిచ్చింది. వారిని విచారణకోసం పిలిచాం'అని ఆయన తెలిపారు.

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇంట్లో బీజేపీ నేతల సీక్రెట్ సమావేశం..ఎజెండా ఏంటి



కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఓ వైపు కేంద్రం కసరత్తు మొదలు పెడుతూనే మరోవైపు రకరకాల వ్యూహాలకు సంబంధించి రౌండ్ సమావేశాలు కూడా సాగుతున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ సమావేశాలకు సంబంధించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇంట్లో ఆదివారం భారీ సమావేశం జరిగింది. జేపీ నడ్డా, అశ్వనీ వైష్ణవ్, కిరణ్ రిజిజు, లాలన్ సింగ్, చిరాగ్ పాశ్వాన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎజెండా, ఏమిటి అనేది ప్రశ్నగా మారింది. రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో జరిగిన సమావేశం ముగిసినట్లు వెలుగులోకి వచ్చింది. మూలాధారాల ప్రకారం.. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్‌డిఏ అభ్యర్థితో పాటు అనేక ప్రతిపక్ష పార్టీలను ఆకర్షించే వ్యూహంపై సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీకి స్పీకర్ పదవి సవాల్‌గా మారింది. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని కావడంతోపాటు మంత్రివర్గంలోని మంత్రులకు శాఖలు కూడా పంచారు. ఇప్పుడు చివరి పని మిగిలి ఉన్నది..లోక్‌సభ స్పీకర్ ఎంపిక. ఇది కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు సవాలేమీ కాదు. గత ప్రభుత్వంలో, కోటా ఓం బిర్లాకు చెందిన బీజేపీ ఎంపి స్పీకర్ పదవిని నిర్వహించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఈ పదవిని ఎవరు ఆక్రమిస్తారో ఇంకా ఎంపిక చేయలేదు. మోడీ క్యాబినెట్ 3.0 ప్రమాణ స్వీకారం, పోర్ట్‌ఫోలియో పంపిణీ తర్వాత, ఇప్పుడు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జూన్ 24 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనితో పాటు జూన్ 26న లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకోవచ్చు. 8 రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జూన్ 24 నుంచి జూలై 3 వరకు జరగవచ్చని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కొత్త ఎంపీలు జూన్ 24, 25 తేదీల్లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. అదే సమయంలో జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది.

# నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు......

# మంత్రులు శ్రీధర్ బాబు, దనసరి అనసూయ సీతక్క

### బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున సంపూర్ణ అండదండలు

### బాధిత కుటుంబానికి రైస్ మిల్ ద్వారా ఐదున్నర లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మరో రెండున్నర లక్షల నష్ట పరిహారం

### చిన్నారి తండ్రికి ఆసిఫాబాద్ లో ఉద్యోగం కల్పన

### సుల్తానాబాద్ కాట్నపల్లి గ్రామ సంఘటన బాధితురాలి కుటుంబానికి పరామర్శ



పెద్దపల్లి,**(గౌతమ్ న్యూస్ ):** సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైస్ మిల్ లో జరిగినసంఘటన అమానుషమని, నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో మమత ఇండస్ట్రీస్ వద్ద ఇటీవల 6 ఏళ్ళ పసిపాపపై జరిగిన సంఘటన ప్రదేశాన్ని మంత్రులు దుదిళ్ళ శ్రీధర్ బాబు, దనసరి అనసూయ సీతక్క,పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, చింతకుంట విజయ రమణారావులతో కలిసి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుల్తానాబాద్ లో మీడియా ప్రతినిధులతో రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ పసిపాప తల్లిదండ్రులు నిద్రపోయే సమయంలో రైస్ మిల్లులో పని చేసే బీహార్ కు చెందిన వ్యక్తి తల్లిదండ్రుల దగ్గర నుంచి పాపను ఎత్తుకు వెళ్లి అత్యాచారం చేసి హత్య చేయడం జరిగిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, ఎంపీ, సహచర ఎమ్మెల్యేలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖ మరింత భద్రత కల్పన, నిఘా పెంపు, డ్రగ్స్ మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి దురలవాట్లకు గురైన వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నేరం చేసిన వ్యక్తులకు సరైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా తీసుకుంటు న్నామని, భవిష్యత్తులో పోలీసు కార్యక్రమాలు పటిష్టం చేస్తామని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం రైస్ మిల్ లో పనిచేస్తున్న దంపతుల 6 సంవత్సరాల బాలికను బీహార్ కు చెందిన నిందితుడు అత్యాచారం చేసి హత్య చేయడం జరిగిందని అన్నారు. బాలిక అదృశ్యంపై సమాచారం అందిన వెంటనే నిమిషాలలో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి తనిఖీలు చేసి సంఘటన స్థలంలో విచారించి నిందితుడిని పట్టుకున్నారని, అప్పటికే ఆ బాలిక చనిపోయిందని అన్నారు. మానవ ప్రపంచం క్షమించరాని నేరాన్ని నిందితుడు చేశాడని, పూర్తి స్థాయి వివరాలు తెలుసుకునేందుకు మంత్రి స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి రావడం జరిగిందని, ఆ చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించామని అన్నారు. చిన్నారి బాలికను ఆ కిరాతకుడు దారుణంగా హత్య చేయడమనేది ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని అన్నారు. ఈ కేసులో నిందితుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో త్వరిత గతిన శిక్ష పడే విధంగా ఆధారాలు ప్రవేశపెట్టడం జరుగుతుందని అన్నారు. పోలీసులకు సమాచారం అంది బాలిక ఆచూకీ తెలుసుకునే లోపే నిందితుడు ఆ బాలికను హత్య చేయడం, ఒక గంట వ్యవధిలో ఇది జరగడం దురదృష్టకరమని నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అనంతరం పెద్దపల్లి క్యాంపు కార్యాలయం వద్ద ఈ సంఘటనపై మంత్రుల బృందం ఎంపీ., ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు,స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నా రని గమనించామని అన్నారు. డ్రగ్స్, గంజాయిని ఉక్కు పాదంతో అణిచి వేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని, వ్యక్తి యొక్క ఆరోగ్యంతో పాటు సమాజానికి సైతం డ్రగ్స్, గంజాయి నష్టం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన శిక్ష పడే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చర్యలు తీసుకొని, నిందితుడికి త్వరగా శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా తగు విధమైన జాగ్రత్త చర్యలు పోలీస్ కమీషనర్ చేపట్టడం జరుగుతుందని, ప్రతి ఇంటిలో పనిచేసే డొమెస్టిక్ హెల్పర్, ప్రతి పరిశ్రమలో పనిచేసే వర్కర్ల బ్యాక్ గ్రౌండ్ చెక్ చేసిన తర్వాతే వారికి ఉపాధి కల్పించడం జరుగుతుందని, ఇది ప్రత్యేకంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాల వినియోగంపై పోలీసు శాఖ ఉక్కు పాదం మోపుతుందని మంత్రి తెలిపారు. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం ఎవరూ తీర్చలేరని, ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు చిన్నారి తండ్రికి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ తో చర్చించి ఉద్యోగం కల్పించనున్నట్లు, వారికి సొంత ఇంటి మంజూరు, ఆ తల్లిదండ్రుల వద్ద ఉన్న మరో పాప చదువు బాధ్యతలను సైతం ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ,సుల్తానాబాద్ లో జరిగిన చిన్నారి సంఘటన పట్ల యావత్ రాష్ట్రం దిగ్భ్రాంతికి గురైందని, సభ్య సమాజం తలదించుకునే విధంగా ఆ ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. బాధిత కుటుంబానికి సంబంధిత రైస్ మిల్ నుంచి ఐదున్నర లక్షల రూపాయల పరిహారం, అదేవిధంగా మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రిని కలిసి చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున మరో రెండున్నర లక్షల పరిహారం అందించాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు 200 పైగా రైస్ మిల్లులు ఉంటాయని, చాలా కాలంగా సీజన్ సమయంలో ఒరిస్సా, బీహార్, మధ్యప్రదేశ్ నుంచి కార్మికులు ధాన్యం కొనుగోలు సమయాల్లో వచ్చి పని చేస్తారని, ఎప్పుడు ఇలాంటి సంఘటనలు జరగ లేదని, దీని పట్ల చాలా బాధపడుతున్నా మని అన్నారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట డిసిపి ఎం.చేతన, ఏ.సి.పి.లు గజ్జి క్రిష్ణ, రమేష్, సి.ఐ.క్రిష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాతినిధ్య ప్రతిబింబం!



'ఇల్లును చూసి ఇల్లాల్ని చూడాలి' అనేది పాత నానుడి. అది మహిళలను ఇంటికి, ఇంటి పనులకు పరిమితం చేసిన వారి వచనం. ఇపుడు పార్లమెంటు సభ్యులను చూసి, ప్రభుత్వ ఆలోచన లనూ ఆచరణనూ చెప్పవచ్చు. మనం ఎటువైపుగా పోతున్నామనే విషయం ఎన్నుకోబడుతున్న సభ్యులు ఎవరు ఎంతెంత అనే విషయాలు ఇట్టే చెప్పేస్తాయి. 'ఫేస్ ఈజ్ ఇండెక్స్ ఆఫ్ ద మైండ్' అని ఆంగ్లం లోనూ ఉన్నట్లే, ఇప్పుడు లోకసభ ముఖం చూసి సారాన్ని పట్టుకోవచ్చు. అయితే మన దేశంలోని మీడియా, మేధావులు, నాయకులు పెద్దగా వీటి గురించి చర్చించినట్టు, పట్టించుకున్నట్టు లేదు. వాళ్లకవి అవసరం లేదు. కానీ ప్రజలు పట్టించుకోవాల్సినవి. దేశ భవిష్యత్తు గురించి ఆలోచించే వారు తప్పక చర్చించాల్సినవి. మొదటిది ఏమంటే జనాభాలో సగం మందిగా ఉన్న మహిళల భాగస్వామ్యం లోక్సభలో అత్యల్పంగా ఉంది. రెండవది, కొత్తగా కొలువైన భారత ప్రభుత్వ మంత్రి మండలిలో ముస్లిం సామాజిక వర్గపు ప్రాతినిధ్యమేలేదు. కానీ నేరచరితుల, ధనవంతుల ప్రాతినిధ్యము మాత్రము బ్రహ్మాండంగా పెరిగింది. వీళ్లు మన దేశ ప్రజలకు ఆదర్శపాలనను, నీతివంతమైన పాలనను అందిస్తారని భ్రమాత్మకంగానైనా అనుకోవాల్సిందే. మహిళల పట్ల బీజేపీ లేదా సంఘ్ పరివార్ ఆలోచనలు అన్నీ వాళ్లు వంటింటికి పరిమితం కావాలన్నదే.సనాతన ధర్మం ప్రకారం మహిళలు పురుషులు చెప్పినట్లు వినాలని, బలహీనులన్న భావనే ఉంది. అనేక సంవత్సరాలుగా మహిళలు చట్టసభల్లో తమకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళల ఓట్ల మద్దతు కూడగట్టటం కోసం 2023లో 33 శాతం రిజర్వేషన్ల చట్టం చేసినప్పటికీ, అది అమలుకు అనేక అడ్డంకులను సృష్టించారు. నియోజక వర్గాల పునర్విభజన తర్వాతనే మహిళల రిజర్వేషను అమలు జరుగుతుందని ఆ బిల్లులో పేర్కొన్నారు. అంటే, జనాభా లెక్కలు జరగాలి.దాని ప్రకారం నియోజకవర్గాల విభజన జరగాలి. అప్పటికి గానీ మోక్షం కుదరదు. ఎప్పుడు జరుగుతుందో చెప్పలేము, పదేండ్లూ పట్టవచ్చు. అరచేతిలో పెట్టి మోచేతిని నాకమన్నట్టుంది. ఈ 18వ లోకసభలో మొత్తం 543 మంది సభ్యుల్లో మహిళలు 74 మంది ఎన్నికయ్యారు. అంటే కేవలం 13.63 శాతం మాత్రమే. 2019లో ఇది 14.36 శాతంగా ఉండింది. పార్టీలు మహిళలను పోటికి నిలబెట్టిందే తక్కువ, గెలిచిందీ తక్కువే. బీజేపీ నుంచి 31 మంది గెలవగా కాంగ్రెస్ నుండి 13 మంది, టీఎంసీ నుంచి 11 మంది, ఎస్పీ-5, డి.ఎం.కె.-3, ఇలా ఉన్నారు. మొత్తంగా చూస్తే తృణముల్ కాంగ్రెస్సే ఎక్కువ మంది మహిళలను నిలబెట్టిందీ, గెలిచిందీ కూడా. ఈ లెక్కలన్నీ 75 ఏండ్ల తర్వాత కూడా సగపాలుగా ఉన్న మహిళలను పాలనకు దూరంగానే ఉంచు తున్నాము అని తేల్చాయి. లింగ వివక్షత కొనసాగుతూనే ఉన్నది. ఇదిలా ఉండగా కొత్తగా ఎన్నికయిన ఎన్డీయే కూటమి మంత్రిమండలిని ఏర్పాటు చేసింది. అందులో దాదాపు ఇరవైకోట్ల జనాభా కలిగిన ముస్లిం సామాజిక వర్గం నుండి ఒక్కరంటే ఒక్కరు కూడా మంత్రిగా లేరు. అసలు బీజేపీ ఎన్నికలలో సీట్లను కూడా వారికి కేటాయించలేదు. మన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, ప్రాణత్యాగాలు చేసి, దేశంలో జీవనం సాగిస్తున్న ఆ సామాజిక వర్గానికి పాలనలో భాగస్వామ్యం లేదు. ఒక ప్రాతినిధ్య ప్రజా స్వామిక వ్యవస్థలో, భిన్నత్వంలో ఏకత్వం అనే రాజ్యాంగ స్ఫూర్తిని, భిన్న జాతుల, మతాల, తెగల సామాజిక తరగతుల దేశంగా మనకున్న పేరుని ఈ విషయాలు వమ్ము చేస్తున్నాయి. పాలక వర్గాలు కావాలనే ఈ విభజనను తీసుకొస్తున్నారు. పైకెన్ని నీతులు వల్లించినా ఆచరణ మాత్రం అందుకు భిన్నంగా సాగుతోందనటానికి ఇది స్పష్టమైన ఉదాహరణ. ఇక మన చట్ట సభలలో పెరుగుతున్న అంశాలు కూడా చూస్తే, అసలు చిత్రం బోధపడుతుంది. కొత్తగా కొలువైన మంత్రి వర్గంలోనే నేరమయ చరిత్ర గలవారు 28 మంది ఉన్నారని ఏడిఆర్ నివేదిక తెలుపుతున్నది. అందులోనూ 19 మంది మంత్రులు హత్యాయత్నం, మహిళలపై నేరాలు, విద్వేష ప్రసంగాలు మొదలైన అభియోగాలు ఎదుర్కొంటున్నారు. అంటే మొత్తం మంత్రి వర్గంలో 39 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇంకో విషయమేమిటంటే మొత్తం 71 మంది మంత్రుల్లో 70 మంది కోటీశ్వరులే ఉన్నారు. రూ. వందకోట్లకు ఎక్కువ ఉన్నవారే ఉన్నారంటే, వారందరూ ఏదో ఒక వ్యాపారంతో మార్కెట్తో ముడిపడి ఉన్నారు. మొత్తం లోకసభలోనూ 93 శాతం సభ్యులు కోట్లకు పడగలెత్తిన వారే. నేరచరితగలవారు మొత్తం సభ్యులలో 46 శాతం ఉన్నారు. వీళ్లందరూ మనకు ఆదర్శ వంతమైన పరిపాలనను అందిస్తారని భావించాలి! అసమానతలు, వివక్షతలు, వ్యాపార ప్రయోజనాలు, ధనవంతుల సమ్మేళనంగా, నేరమయ సమూహంగా మారిన చట్టసభలు ఏ నీతిని, విలువను, ఏ ఆదర్శాన్ని అందిస్తాయి! ఆలోచించాల్సిన విషయం కదా!

# విదేశాంగ విధానంపై ప్రభావం

### సంకీర్ణ ప్రభుత్వంలో మోడీ సర్కారుకు సవాలు- టీడీపీ, జేడీ(యూ) వంటి ప్రాంతీయ పార్టీలది కీలక పాత్ర

### నిపుణులు, విశ్లేషకుల అంచనా



న్యూఢిల్లీ : కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చింది. గత రెండు దఫాలు కూడా ఎన్డీఏ కూటమే అధికారంలో ఉన్నప్పటికీ.. బీజేపీకి విస్పష్టమైన మెజారిటీ ఉండేది. అయితే, ఈ సారి మాత్రం బీజేపీకి అధికారానికి కావాల్సిన సంఖ్యలో సీట్లు రాలేదు. దీంతో కూటమిలోని టీడీపీ, జేడీ(యూ) వంటి కీలక మిత్రపక్షాల సాయంతో మోడీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, సంకీర్ణ ప్రభుత్వంలో భారత విదేశాంగ విధానం ఎలా ఉండబోతుందన్న ప్రశ్నలు నిపుణుల నుంచి ఎదురవుతున్నాయి. ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన నాలుగు రోజులకే ఇటలీలోని పుగ్లియాలో జరుగుతున్న జీ7 సదస్సుకు ప్రధాని మోడీ వెళ్లారు. కొత్త సంకీర్ణ ఆధారిత ప్రభుత్వంలో టీడీపీ, జేడీ(యూ)లు కీలక పాత్రను వహించనున్నాయి. ఎన్డీఏ విదేశాంగ విధానాన్ని రూపొందించడంలో ఈ పార్టీలు కూడా ముఖ్య భూమికను పోషిస్తాయని నిపుణులు చెప్తున్నారు. టీడీపీ ఏపీపై దృష్టి సారించి.. ప్రాంతీయ ఆర్థిక సంబంధాలు, సాంకేతిక సహకారాన్ని పెంపొందించే విధానాల కోసం పట్టుబట్టొచ్చు. అదేవిధంగా, బీహార్ అభివృద్ధి కోసం జేడీయూ వాదిస్తుంది. అభివృద్ధి ప్రాజెక్టులు, ఆర్థిక సాయం వంటి వాటిపై నితీశ్ పార్టీ దృష్టి సారించే అవకాశమున్నది. మరోపక్క, కేంద్ర మంత్రి వర్గంలో అవకాశం విషయంలో మహారాష్ట్రలోని మిత్రపక్షాలైన ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం), రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్నాథ్ షిండేకు చెందిన శివసేన పార్టీలు ఇప్పటికే తమ అసంతృప్తిని ప్రదర్శించాయి. అయితే, ఈ క్లిష్టమైన సంకీర్ణ ప్రభుత్వంలో చట్టం మోడీ దౌత్యపరమైన చతురతను పరీక్షిస్తుందనీ, భారతదేశ అంతర్జాతీయ వ్యూహాలు, జాతీయ లక్ష్యాలు, సంకీర్ణ ఆధారిత సూక్ష్మ నైపుణ్యాలను ప్రతిబింబించేలా చూస్తుందని నిపుణులు అంటున్నారు. కొత్త సంకీర్ణ ఆధారిత మోడీ ప్రభుత్వం.. కూటమిలోని టీడీపీ, జేడీ(యూ) వంటి పార్టీలతో సహా, దాని విదేశాంగ విధానం సంకీర్ణ డైనమిక్స్ ద్వారా ప్రభావితమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ' టీడీపీ, జేడీ(యూ)లు వాటి ప్రాంతీయ ప్రయోజనాలు, రాజకీయ అజెండాలతో, భారతదేశ విస్తృత విదేశాంగ విధాన వ్యూహాన్ని ప్రభావితం చేస్తాయి. అలాగే, తమ ప్రాంతాలకు ప్రయోజనం చేకూర్చే విధానాలను ముందుకు తీసుకురావచ్చు. ఉదాహరణకు, ఈ పార్టీలు తమ ప్రాంతాల నుంచి గణనీయమైన సంఖ్యలో ప్రవాస భారతీయులు విదేశాలలో ఉంటే.. అలాంటి దేశాలతో బలమైన సంబంధాల కోసం లేదా వారి ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలను డిమాండ్ చేయగలవు. ఒక పొందికైన, వ్యూహాత్మక విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తూ సంకీర్ణ డిమాండ్లను సమతుల్యం చేసుకోవటం మోడీ ప్రభుత్వానికి క్లిష్టమైన సవాలుగా ఉంటుంది' అని నిపుణులు చెప్తున్నారు. సంకీర్ణ ప్రభుత్వం.. విదేశాంగ విధాన లక్ష్యాలను క్రమబద్ధీకరించడం సవాలుగా భావించవచ్చు అని అంటున్నారు. అయినప్పటికీ, చాలా ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యతల జాబితాలో విదేశాంగ విధానం అగ్రస్థానంలో లేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ సంకీర్ణ భాగస్వాములు అంతర్జాతీయ విధాన రూపకల్పనపై దృష్టి పెట్టకుండా.. తమ ప్రాంత ప్రయోజనాల కోసమే ఎక్కువగా ఆలోచిస్తాయని అంటున్నారు. అయితే, విదేశంగ విధానంలో ప్రాంతీయ పార్టీల వ్యవహారం మోడీ 3.0పై అంతగా ప్రభావం చూపకపోవచ్చునీ, ప్రభుత్వాన్ని అస్థిరపర్చటానికి ఇది బలమైన కారణం కాకపోవచ్చని నిపుణులు చెప్తున్నారు.

### జూన్ 30లోపు ఆ వేలం పూర్తి చేయాలి..

## తెలంగాణకు కేంద్రం డెడ్ లైన్



గనుల వేలంపై తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం కీలక సూచన చేసింది. జూన్ 30 వ తేదీ లోపు కనీసం ఆరు బ్లాకులకు వేలం నిర్వహించాలని స్పష్టం చేసింది. ఒక వేళ ఆ పనిని రాష్ట్రం చేపట్టకపోతే ఆ ప్రక్రియను తామే పూర్తి చేస్తామని కేంద్ర గనుల శాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖను రాసింది. తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం ఒక్క మినరల్ బ్లాక్ ను కూడా వేలం వేయలేదని కేంద్ర గనుల శాఖ పేర్కొంది. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి 11 బ్లాకుల జియాలాజికల్ నివేదికలను పంపించినట్టు అధికార వర్గాలు తెలిపారు. వీటిలో ఐదు సున్నపురాయి, ఐదు ఇనుప ఖనిజం, ఒకటి మాంగనీస్ బ్లాకు ఉన్నాయని, గనుల వేలం విషయం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర గనుల శాఖ పలుమార్లు గుర్తు చేసినప్పటికీ ఆ ప్రక్రియ నిర్వహించలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో జూన్ 30 నాటికి కచ్చితంగా కనీసం ఆరింటికి వేలం పూర్తి చేయాలని లేఖలో స్పష్టం చేసింది. దేశంలో గనుల వేలం ప్రక్రియ 2015లో ప్రారంభం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేయకుంటే వాటిని వేలం వేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి దక్కేలా 2021లో నిబంధనలను సవరించారు. దీని ప్రకారం దేశవ్యాప్తంగా 354 ప్రధాన మినరల్ బ్లాక్ లను వేలం వేయగా 48 చోట్ల ఉత్పత్తి ప్రారంభమైంది. కానీ తెలంగాణలో మాత్రం ఈ ప్రక్రియ జరగలేదని కేంద్రం ఆక్షేపించింది.

## మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై రాళ్ల దాడి



వైసీపీ నేతల ఇళ్లపై వరుస దాడులు ఏపీలో రాజకీయాల్లో కాకరేపుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో కొత్తగా కొలువుదీరిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం.. గత సర్కార్ లాగా తాము కక్ష సాధింపు చర్యలకు దిగమని చెబుతుంటే.. మరోవైపు ఆ పార్టీలకు చెందిన కార్యకర్తలు వైసీ నేతల ఇళ్లపై దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవల-వైసీపీ ఫైర్ బ్రాండ్, మాజీ మంత్రి కొడాలి నాని ఇంటిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు, గుడ్లతో దాడి చేయగా.. తాజాగా మరో వైసీపీ మాజీ మంత్రి ఇంటిపై ఎటాక్ జరిగింది. ఆదివారం ఇద్దరు గుర్తు తెలియని యువకులు విజయవాడలోని మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. యువకులు రాళ్లు రువ్వడం గమనించిన జోగి రమేష్ భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తం కావడంతో దుండగులు అక్కడి నుండి పరార్ అయ్యారు. కారులో వచ్చి రాళ్ల దాడికి పాల్పడినట్లు మాజీ మంత్రి భద్రతా సిబ్బంది తెలిపారు. ఈ మేరకు జోగి రమేష్ సెక్యూరిటీ సిబ్బంది రాళ్ల దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు అయితే, జోగి రమేష్ ఇంటిపై రాళ్ల దాడి చేసిన యువకులు జనసేన పార్టీ అభిమానులుగా సోషల్ మీడియాలో పచారం జరుగుతోంది.

## వచ్చే మూడు రోజులు ఆ జిల్లాల్లో భారీ వర్షాలు.. !



రాయలసీమ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉందని ప్రకటించింది. దీని ప్రభావంతో తెలంగాణలో వచ్చే మూడు రోజులు తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆదివారం సాయంత్రం నుంచి వర్షాలు కురుసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. వర్షం కురిసే సమయంలో ఉరుములు, మెరుపులు గంటకు 30-40 కి.మీతో ఈదురు గాలులు వస్తాయని పేర్కొంది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. సోమవారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, కామారెడ్డి జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం సాయంత్రం కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వాన పడింది. తెలంగాణలో ఇదే వాతావరణ పరిస్థితి వరుసగా మూడు రోజులు కొనసాగనుందని అంచనా వేసింది. తెలంగాణ వ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించాయని పేర్కొంది. ద్రోణికి తోడు రుతుపవనాలు ఉండడంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## గత సర్కారు నిర్లక్ష్యం రేవంత్ సర్కారుకు తేల్చేసిన కేంద్రం



తెలంగాణలో గనుల వేలంపై కేంద్రం సీరియస్ అయ్యింది. గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం ఒక్క మినరల్ బ్లాక్ను కూడా వేలం వేయలేదని కేంద్ర గనుల శాఖ పేర్కొంది. జూన్ 30 నాటికి కనీసం ఆరింటికి వేలం పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత తెలంగాణ సర్కారుకు స్పష్టం చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి 11 బ్లాకుల జియాలాజికల్ నివేదికలను పంపినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. వీటిలో ఐదు సున్నపురాయి, ఐదు ఇనుప ఖనిజం, ఒకటి మాంగనీస్ బ్లాకు ఉన్నట్లు వెల్లడించారు. గనుల వేలంపై కేంద్ర గనుల శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు గుర్తు చేసినప్పటికీ.. ఒక్క బ్లాక్ను కూడా వేలం వేయలేదని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 30 నాటికి కచ్చితంగా కనీసం ఆరింటికి వేలం పూర్తిచేయాలని సూచిస్తూ తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర మంత్రిత్వశాఖ లేఖ రాసింది. ఈ విషయంలో విఫలమైతే, ఆ ప్రక్రియను కేంద్రమే చేపట్టాల్సి వస్తుందని తేల్చి చెప్పింది. కాగా, దేశంలో గనుల వేలం(మినరల్ బ్లాక్స్ ఆక్షన్) ప్రక్రియ 2015లో ప్రారంభమైంది. 2021లో ఈ నిబంధనలను సవరించారు. వాటి ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేయాలి. లేని పక్షంలో వాటిని నిర్వహించే అధికారం కేంద్రానికి వస్తుంది. ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా 354 ప్రధాన మినరల్ బ్లాక్లను వేలం వేశారు. 48 చోట్ల ఉత్పత్తి ప్రారంభమైంది. దీంతో సదరు రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలోనే, తెలంగాణలో మేజర్, మైనర్ మినరల్ బ్లాకులను వేలం పద్ధతిలో కేటాయించేందుకు గనులశాఖ సిద్ధమైందని, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఇటీవల తెలిపాయి. ఖనిజాల వారీగా ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. ఇందులో మూడు సున్నపురాయి బ్లాకులు కాగా, మరో 12 చిన్నతరహా ఖనిజాలని తెలిసింది తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం రాగానే వేలం ప్రక్రియను ప్రారంభించాలని గనుల మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేలంలో అర్హత సాధించిన వారికి ఆయా గనుల్ని 20 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే అవకాశం ఉంది.

# ఇటలీలో జి7 దేశాల మల్లగుల్లాలు!




ఏడు ధనికదేశాల కూటమి(జి7) 50వ వార్షిక సమావేశం గురువారం నాడు ఇటలీలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ భేటీకి రికార్డు స్థాయిలో భారత్,బ్రెజిల్తో సహా పన్నెండు దేశాల నేతలను అతిధులుగా ఆహ్వానించటం ఒక విశేషం. రష్యా మీద ఆంక్షలను వెయ్యి నుంచి నాలుగువేల వరకు విస్తరించేందుకు. ఇప్పటికే స్తంభింపచేసిన 28 వేల కోట్ల డాలర్ల (280 బిలియన్ డాలర్లు) రష్యా ఆస్తుల మీద వచ్చే రాబడి నుంచి ఉక్రెయిన్కు 50 కోట్ల డాలర్ల సాయం అందించాలన్న అమెరికా ప్రతిపాదనలు,చైనా కట్టడి అనే నిరంతర అజెండా ప్రధానంగా ఈ సమావేశం ముందున్నాయి.తన మీద పడే భారాన్ని తప్పించుకొనే అమెరికా ఎత్తుగడ, ఎన్నికల్లో స్వలాభం పొందే జోబైడెన్ మంత్రాంగం ఉంది. ఉక్రెయిన్కు సాయంపై ఐరోపా సమాఖ్యలో ఏకాభిప్రాయం వస్తేనే అది వీలుపడుతుంది. అయితే అలాంటి హామీ ఇచ్చే పరిస్థితి లేదన్నది విశ్లేషకుల అంచనా.ఎన్ని ఆంక్షలు విధిస్తే అంతగా అన్నట్లు వాటి ప్రభావం రష్యామీద ఇప్పటివరకు పెద్దగా లేదు. ఈ కారణంగానే మరోసారి గట్టిగా ఊపి చూద్దాం అనే తెగింపుతో పశ్చిమదేశాలు ఉన్నాయి. అంతా మీరే చేస్తున్నారంటూ రష్యా ఆర్థికంగా, ఇతరంగా నిలదొక్కుకోవటానికి కారణం చైనా అని పశ్చిమదేశాలు చిందులు వేస్తున్నాయి. తాము ఇచ్చిన ఆయుధాలతో అన్నెంపున్నెం ఎరగని పిల్లలు, మహిళలను గాజాలో ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ దుశ్చర్యలు దానికి కనిపించవు. చైనా అందిస్తున్న యంత్రాలు, చిప్స్ వంటి వాటిని ఆయుధాల తయారీతో సహా వినియోగవస్తువుల తయారీకీ రష్యా వినియోగించవచ్చు. దీన్ని సహించలేక అనేక ఆరోపణలు చేస్తున్నాయి. అవసరానికి మించి అధిక ఉత్పత్తులు చేసి ప్రపంచ మార్కెట్లలో కుమ్మరిస్తున్నదనేది ఒకటి. ఆ సాకుతో చైనా విద్యుత్ వాహనాల దిగుమతులపై పన్ను మొత్తాన్ని 25 నుంచి 100శాతానికి పెంచిన అమెరికా అడుగుజాడల్లో ఐరోపా దేశాలు 38శాతం వరకు పెంచేందుకు నిర్ణయించి ఈ సమావేశానికి వచ్చాయి. అంటే రష్యా, చైనాలతో అమీ తుమీ తేల్చు కొనేందుకు సిద్ధప డుతున్నాయి. ఇల్లలకగానే పండగ కాదన్నట్లు అమెరికా ప్రతిపాదనల మీద ఏకాభిప్రాయం కుదురు తుందనే పరిస్థితి లేదు. రష్యా ఆస్తులు ఐరోపా దేశాల్లో ఉన్నాయి. 'మీరు మమ్మల్ని ఇబ్బందిపెడితే మిమ్మల్ని ఇరికించే అవకాశం మాకూ ఉంది వెనుకా ముందు ఆలోచించుకోండని' రష్యా హెచ్చరిం చింది. గతవారంలో జరిగిన ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో పచ్చిమితవాద శక్తుల బలం పెరుగుదల, దానితో ముడివడిన సమస్యలను ఈ సమావేశం విస్మరించే అవకాశం లేదు. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ 250 రోజులుగా కొనసాగుతున్నది, హమాస్ తీవ్రవాదులను పట్టుకొనే పేరుతో ఇజ్రాయిల్ జరుపుతున్న ఈదారుణకాండలో ఇంతవరకు ఎంతమందిని పట్టుకున్నదీ చెప్పలేని స్థితి. మరోవైపు ప్రపంచ వ్యాపితంగా దానికి మద్దతిస్తున్న పశ్చిమదేశాల మీద ఒత్తిడి తీవ్రమవుతున్నది. ఉక్రెయిన్లో రష్యా సైనిక చర్య 840వ రోజులో ప్రవేశించింది.రోజు రోజుకూ జెలెన్స్కి సేనలు బలహీనపడటం తప్ప జరుగుతున్నదేమీ లేదు. పశ్చిమ దేశాలు అందించిన ఆధునిక ఆయుధాలు రష్యాను ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా వెనక్కునెట్టలేకపోయాయి. తమ మీద జరుపుతున్న వాణిజ్యపోరును పశ్చిమదేశాలు ఎంతకాలం, ఎలా కొనసాగిస్తాయో తగ్గేదేలే మేమూ చూస్తామన్నట్లుగా చైనా ఉంది.తన ఎత్తుగడలను తానూ అమలు చేస్తున్నది.పశ్చిమ దేశాలు కాటువేసేందుకు అవకాశాలు దొరక్క ప్రస్తుతం బుసలు కొట్టే స్థితిలోనే ఉన్నప్పటికీ వాటి కోరల్లో దాగిన విషాన్ని విస్మరించకూడదు. వివిధ ప్రపంచ పరిణామాల పట్ల డోలాయమానస్థితి, విబేధాలు, అసాధారణ సవాళ్ల నడుమ ఈ కూటమి ఇటలీ మధనంలో ఏమి వెలువడుతుంది అన్నదానిపై ఆసక్తి నెలకొన్నది. తమ కంట్లో నలుసుల్లా, కొరుకుడు పడని ముక్కల్లా ఉన్న చైనా, రష్యా, ఇరాన్ వంటి దేశాలను ఎలా కట్టడి చేయాలి? ప్రపంచాధిపత్యాన్ని ఎలా నిలుపుకోవాలి? కానసాగించాలనే యావతో ఉన్న జి7కు ఆత్రం తప్ప ఎలా ముందుకు పోవాలో తెలియని స్థితి గత జపాన్ సమావేశాల్లో వెల్లడైంది. గాజాలో జరుగుతున్న మారణకాండను నిలిపేసేందుకు ఏ మాత్రం ముందుకు రాని ఈ గుంపు తమ కారణంగానే తలెత్తిన ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరిం చేందుకు చొరవ చూపకపోగా మరింత ఆజ్యం పోసి జనాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నది. కాలిగోళ్లపుడే కాపురం చేసేదీ లేనిదీ తెలుస్తుందన్నట్లుగా ఈ సమావేశాలకు వస్తూ కొన్ని దేశాలు తీసుకున్న నిర్ణయాలు ఘర్షణ, ఉద్రిక్తతలను పెంచేవేవిగా ఉన్నందున ఇటలీ భేటీలో జరిగేదేమిటో ఊహించుకోవచ్చు.

# ఈవీఎంల ట్యాంపరింగ్‌తో ఎన్నికల్లో విజయం..

### రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు




న్యూఢిల్లీ : ప్రముఖ బిలియనీర్ ఎలోన్ మస్క్ ఈవీఎంలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంల భద్రతను ప్రశ్నిస్తూ ఎలోన్ మస్క్ చర్చకు తెర లేపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లను రద్దు చేయాలని పిలుపునిచ్చారు. మానవులు, లేదా ఏఐ ద్వారా ఈవీఎంలను హ్యాక్ చేసే ప్రమాదం చాలా తక్కువ స్థాయిలో ఉన్నప్పటికి వాటి పర్యవసానాలు భారీ స్థాయిలో ఉంటాయని ట్వీట్‌లో పేర్కొన్నారు. భారత్‌లో ఈవీఎంల పనితీరుపై అనుమానాలు తలెత్తుతున్న తరుణంలో మస్క్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరోక్షంగా స్పందించారు. దేశంలోని ఈవీఎంలను'బ్లాక్ బాక్స్'అని అభివర్ణించారు. ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ స్థానం ఫలితాలపై దుమారం రేపిన వార్తా కథనాల్నిఉదహరిస్తూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. 'భారత్‌లో ఈవీఎంలు ఒక బ్లాక్ బాక్స్. వాటిని పరిశీలించడానికి ఎవరికీ అనుమతి లేదు.మా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత గురించి తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతున్నాయి'అని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. సంస్థల్లో జవాబుదారీతనం లోపించినప్పుడు ప్రజాస్వామ్యం బూటకంగా మారుతుంది. మోసానికి గురవుతుందన్నారు. ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభలో గెలిచిన అభ్యర్థి బంధువులు ఈవీఎంలకు కనెక్ట్ చేసిన ఫోన్‌ను ఉపయోగిస్తున్నారంటూ వచ్చిన కథనాల్ని ట్వీట్ చేశారు. ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ శివసేన ఎంపీ రవీంద్ర వైకర్ లోక్‌సభ ఎన్నికల్లో 48 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇప్పుడు ఆయన గెలుపుపై వివాదం నెలకొంది. అందుకు జూన్ 4న రెస్కో పోలింగ్ కౌంటింగ్ సెంటర్ బయట ఎంపీ రవీంద్ర వైకర్ బావ మంగేష్ పన్వాల్కర్ ఫోన్ వినియోగించారు. ఆ ఫోన్ వినియోగించడం వల్లే రవీంద్ర వైకర్ 48 ఓట్ల తేడాతో గెలుపొందారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కౌంటింగ్ సెంటర్‌లో ఉన్న ఈవీఎం మెషిన్‌కు మంగేష్ పన్వాల్కర్‌కు ఫోన్‌కు మధ్య కనెక్టివిటీ ఉందని, ఫోన్‌లో ఓటీపీ సాయంతో కౌంటింగ్ సెంటర్‌లో ఉన్న ఈవీఎం మెషిన్ ఓపెన్ అయ్యేలా టెక్నాలజీని వినియోగించినట్లు పలు జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. మంగేష్ ఫన్వాల్కర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిజానిజాలు తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.

ఈవీఎంలను నిషేధించాలంటూ మస్క్ చేసిన వ్యాఖ్యలపై మాజీ కేంద్రమంత్రి, బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. భారత్‌లోని ఈవీఎంల తయారీ చాలా కట్టుదిట్టంగా ఉంటుంది. వాటిని ఎవరు కనెక్ట్ చేయలేరు. కనెక్టివిటీ లేదు, బ్లూటూత్, వైఫై,ఇంటర్నెట్‌ను వినియోగించలేరని అన్నారు.

# నిరాధారమైన ఆరోపణలను ఖండించిన టీజీఎస్‌ఆర్టీసీ



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ)లో ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం (ఏఎఫ్‌సీఎస్) అమలు విషయంలో చేస్తోన్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకు బోర్డు అనుమతితోనే ఈ వ్యవస్థను సంస్థ అమలు చేయడం జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని చేస్తోన్న నిరాధారమైన ఆరోపణలను టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఖండిస్తోంది. నియమ నిబంధనలకు లోబడి బోర్డు అనుమతితోనే సంస్థలో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేస్తోంది. అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకుని ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టంను అమలు చేయాలని టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం 2022లోనే నిర్ణయించింది. బస్సుల్లో యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులతో కూడిన డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్ కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్ పాస్ ల సౌకర్యం కల్పిస్తూ.. సేవలను మరింతగా సులభతరం చేయడమే ఈ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం. ఈ వ్యవస్థ వల్ల రియల్ టైం సమాచారం ఎప్పటికప్పుడు క్షణాల వ్యవధిలో సంస్థకు తెలుస్తుంది. ఈ సమాచారంతో ప్రయాణికుల డిమాండ్ మేరకు రద్దీని బట్టి సర్వీసులను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రస్తుత టికెటింగ్ వ్యవస్థ కంటే ఇది ఎంతో మెరుగైనది. డిజిటల్ టికెటింగ్ కు సంబంధించిన టెండర్ ప్రకటనను 02-11-2022 టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం విడుదల చేసింది. అప్పుడు ఈ టెండర్ ప్రక్రియలో ఆరు కంపెనీలు పాల్గొన్నాయి. టెండర్ లో ఇంటలిజెంట్ టికెటింగ్ మిషన్ల సప్లై, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్, రోజువారి నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, సాంకేతికత, మ్యాన్ పవర్, తదితర సర్వీసులు ఉన్నాయి. ఆన్ లైన్ టికెట్ రిజర్వేషన్ కు సంబంధించిన సర్వీస్ ప్రొవైడర్ గడువు ముగుస్తుండటంతో.. ఆన్ లైన్ రిజర్వేషన్ తో పాటు డిజిటల్ టికెటింగ్ సౌకర్యం ఒకటే సర్వీస్ ప్రొవైడర్ దగ్గరుంటే నిర్వహణ సులువుగా ఉంటుందని యాజమాన్యం భావించింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల శాఖ ప్రజా రవాణా వ్యవస్థలో సాంకేతికత అమలుకు రూ.20.97 కోట్లు నిధులను సంస్థకు మంజూరు చేసింది. ఆ నిధులతో ఐటిమ్స్ ను సొంతంగా కొనుగోలు చేయాలని సంస్థ నిర్ణయించింది. పై రెండు కారణాల వల్ల ఆ టెండర్ ను 03.07.2023న రద్దు చేయడం జరిగింది. ఏఎఫ్‌సీఎస్ ను వీలైనంత త్వరగా అమలు చేయాలనే ఉద్దేశంతో మరో టెండర్ ప్రకటనను 11.01.2024న సంస్థ విడుదల చేసింది. డిజిటల్ టికెటింగ్ సాఫ్ట్ వేర్ తో పాటు ఆన్ లైన్ రిజర్వేషన్ ను కలిపి.. ఐటిమ్స్ కొనుగోలు, సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్, నిర్వహణ అంశాలను వేర్వేరుగా పేర్కొంటూ ధరలను సూచించాల్సిందిగా ఆ టెండర్ ను జారీ చేసింది. ఈ టెండర్ లో మూడు కంపెనీలు పాల్గొన్నాయి. ఆయా కంపెనీల డాక్యుమెంట్స్ తో పాటు సాంకేతిక నిర్వహణ సామర్థ్యంపై ప్రజంటేషన్స్ ను కమిటీ పరిశీలించింది. ఏ కంపెనీకి కూడా టెండర్ లో పేర్కొన్న అన్ని సేవలను సంతృప్తి కరంగా అందించే సామర్థ్యం లేనందున.. కమర్షియల్ బిడ్ ను ఓపెన్ చేయకుండానే ఈ టెండర్ ను 29.02.2024న సంస్థ రద్దు చేసింది. ప్రస్తుతం సంస్థ వాడుతున్న సాధారణ టిమ్ లు కాలపరిమితి పూర్తవుతుండటం, ఆన్ లైన్ టికెట్ రిజర్వేషన్ సర్వీస్ ప్రొవైడర్ గడువు ముగుస్తుండటం, కేంద్ర నిధులు నిరుపయోగంగా ఉండటంతో ఏఎఫ్‌సీఎస్ త్వరగా అమలు చేసేందుకు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. గత టెండర్లలో పాల్గొన్న కంపెనీల అనుభవం, పనితీరును ఆ కమిటీ మరోకసారి పరిశీలించింది. సదురు కంపెనీల సాంకేతిక నిర్వహణ సామర్థ్యం, పూర్వ అనుభవం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని.. సంస్థకు అవసరమైన అన్ని సేవలను త్వరితగతిన స్థిరంగా అందించగలిగిన కంపెనీని ఎంపిక చేయాలని కమిటీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం పనితీరు, అందిస్తోన్న సేవలపై సమగ్రంగా అధ్యయనం చేసేందుకు టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం దేశంలోని పలు రాష్ట్రాల్లో పర్యటించింది. అక్కడి ఉన్నతాధికారులను సంప్రదించి.. వారి అభిప్రాయాలను సేకరించింది. ఈ వ్యవస్థ అమలుకు సాంకేతిక నిర్వహణ సామర్థ్యం, నాణ్యత ప్రమాణాలు, మెరుగైన పనితీరు, ఆర్థిక, తదితర అంశాలను ఇతర కంపెనీలతో బేరిజు వేసుకుని ఛలో మొబిలిటీకి ఈ సేవలను అందించే బాధ్యతను అప్పగించాలని ఉన్నతస్థాయి కమిటీ ప్రతిపాదించింది. ఛలో మొబిలిటీ సంస్థకు క్యూఆర్ బేస్డ్ మొబైల్ టికెటింగ్, క్లోజ్డ్ లూప్ స్మార్ట్ కార్డ్స్, మొబైల్ పాసెస్, ఎన్ సీ ఎంసీ కార్డుల జారీలో మంచి అనుభవముంది. ఈ కంపెనీ బృహన్ ముంబై ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్ పోర్ట్ అండర్ టేకింగ్ (బెస్ట్)లో 3500 బస్సుల్లో పై సేవలను సమర్థవంతంగా అందిస్తోంది. బెస్ట్ తో పాటు ఈ కంపెనీ బిహార్, అసోం, తదితర రవాణా సంస్థలతో పాటు ఇండోర్, జబల్ పూర్ నగరాల్లో 10 వేలకు పైగా ఐటిమ్స్ ద్వారా నాణ్యమైన సేవలను అందిస్తోంది. ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభూతిని కల్పించడం కోసం.. అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. డిజిటలైజేషన్ లో వస్తోన్న పోకడలపైన ప్రత్యేక దృష్టి పెట్టి.. ముంబైలో దాదాపు 11 లక్షల స్మార్ట్ కార్డులను జారీ చేసిన అనుభవం ఈ కంపెనీకి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న మహాలక్ష్మి - మహిళలకు ఉచిత బస్సు సౌకర్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు స్మార్ట్ కార్డులు జారీ చేయాలని భావిస్తున్నందున.. ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించింది. సంస్థకు సాంకేతికపరమైన భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ కంపెనీ సరైనదని కమిటీ నిర్ధారించింది. పలు దఫాలుగా ఛలో మొబిలిటీతో చర్చించింది. ఇతర రాష్ట్రాల రేట్ల ను పరిశీలించింది. తక్కువ ధరకు ఇక్కడ ఏఎఫ్‌సీఎస్ అమలుకు అంగీకరించడంతో.. ఆ కంపెనీతో ఒప్పందం చేసుకోవాలని సూత్రప్రాయంగా సంస్థ నిర్ణయించి.. బోర్డుకు సిఫారసు చేసింది. ఉన్నతస్థాయి కమిటీ నివేదిక ఆధారంగా బోర్డు అనుమతితో 15.03.2024 నాడు చలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఐ) ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం అమలుకు సంబంధించిన కసరత్తును ఛలో మొబిలిటీ ప్రారంభించింది. త్వరలోనే కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనుంది. పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి మూడు నెలల సమయం పడుతుంది. ఒప్పందం ప్రకారం ఐటిమ్స్ సాఫ్ట్ వేర్ నిర్వహణ కు నెలకోసారి సర్వీస్ ప్రొవైడర్ కు నగదు చెల్లించడం జరుగుతుంది. ప్రయాణికుల సంఖ్యను బట్టి కాకుండా.. టికెట్ సంఖ్యను పరిగణలోకి తీసుకుని చెల్లింపులను చేస్తుంది. ఉదాహరణకు ఒకటి కంటే ఎక్కువ మంది ప్రయాణికులు కలిసి ఒకే టికెట్ తీసుకుంటే.. అది ఒక టికెట్ గా పరిగణించబడుతుంది. ఆ కంపెనీకి నగదు చెల్లింపులకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో అవలంభిస్తోన్న విధానాన్నే సంస్థ ఇక్కడ కూడా అమలు చేస్తోంది. కంపెనీల పూర్వ అనుభవం, నిర్వహణ సామర్థ్యం, నాణ్యత ప్రమాణాలు, సాంకేతిక నైపుణ్యత, తదితర అంశాలపై తలెత్తిన సందేహాలను నివృత్తి చేయని సందర్భంలో టెండర్ ప్రక్రియను ఏ దశలోనైనా నిలిపి వేసే సంపూర్ణ అధికారం టెండర్ కమిటీకి ఉంటుంది. ప్రతి టెండర్ నోటిఫికేషన్ లోనూ ఈ విషయాన్ని స్పష్టంగా సంస్థ పేర్కొంటుంది. టీజీఎస్‌ఆర్టీసీలో టెండర్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుంది. బిడ్స్ స్వీకరణకు ముందు ఆశావాహ కంపెనీలతో ప్రీ బిడ్ సమావేశాన్ని సంస్థ ఏర్పాటు చేస్తుంది. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తుంది. నిబంధనలకు లోబడి ఉండే సాధ్యమైన సలహాలు, సూచనలను సంస్థ అంగీకరిస్తుంది. అందుకు సంబంధించిన సవరణ (అమెండ్ మెంట్) డాక్యుమెంట్లను అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచుతుంది. ఇది ప్రతి టెండర్ లోనూ సాధారణంగా జరిగే ప్రక్రియ. టీజీఎస్‌ఆర్టీసీలో సాంకేతిక అంశాలకు సంబంధించిన ఏ టెండర్ ప్రక్రియ అయినా ఆఫ్ లైన్ పద్ధతిలోనే జరుగుతుంది. నోటిఫికేషన్, సంబంధిత సవరణలతో కూడిన డాక్యుమెంట్లను సంస్థ అధికారిక, ప్రభుత్వ వెబ్ సైట్లలో పొందుపరుచడం జరుగుతుంది. ప్రతి టెండర్ నోటిఫికేషన్ ప్రకటనలు మాత్రమే ఆన్ లైన్ లో అందుబాటులో ఉంటాయి. బిడ్ ల స్వీకరణ స్వయంగా వచ్చి దాఖలు చేయాలి. టెండర్లను గోప్యంగా ఉంచుతున్నారని ఆరోపించడంలో నిజం లేదు. ఇది పూర్తి అవాస్తవం. నిబంధనలకు విరుద్ధంగా ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం అమలు జరుగుతుందనే ఆరోపణల్లో వాస్తవం లేదు. సంస్థ నియమ నిబంధనలకు లోబడి బోర్డు అనుమతితోనే సర్వీస్ ప్రొవైడర్ ఎంపిక జరిగింది. సంస్థకు సంబంధించిన టెండర్, ఒప్పందాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రవాణా మంత్రిత్వ శాఖకు గానీ ఎలాంటి ప్రమేయం ఉండదు. పూర్తిగా బోర్డు అనుమతి మేరకే సంస్థలో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తూ సౌకర్యవంతమైన, వేగవంతమైన సేవలందిస్తూ.. ప్రజా రవాణా వ్యవస్థను ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు రెండున్నరేళ్లుగా ఎన్నో కార్యక్రమాలను సంస్థ అమలు చేస్తూ వస్తోంది. అనేక సంస్కరణలను చేసి విప్లవాత్మక మార్పులను సంస్థలో తీసుకురావడం జరిగింది. బోర్డు పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుని.. వాటిని సమర్థవంతంగా అమలు చేయడం వల్లే దేశంలోనే అత్యుత్తమ ప్రజా రవాణా సంస్థగా నేడు టీజీఎస్‌ఆర్టీసీ నిలిచింది. టీజీఎస్‌ఆర్టీసీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం ఏమాత్రం సమంజసం కాదు.

# పిరికి సన్నాసి ఎక్కడ దాక్కున్నావ్



ఏపీలో ఎన్నికలు ముగిశాయి. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, కొణిదెల పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష స్థానాన్ని కూడా దక్కించుకోలేక 11 స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీలోని మంత్రులతో సహా అందరూ ఓటమిబాట పట్టారు. వారిలో ప్రధానమైన వ్యక్తి కొడాలి నాని. వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణ గురించి నోటికి ఎంత మాట వస్తే అంత మాట మాట్లాడటం, అసభ్య పదజాలాన్ని ఉపయోగించడంపై కార్యకర్తలు రగిలిపోయారు. కొడాలి నాని ఓడిపోవడంతో అతనికి ఉన్న భద్రతను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. వైసీపీ నేతలందరిపై ప్రస్తుతం ట్రోలింగ్ నడుస్తోంది. ఎన్నికల్లో చంద్రబాబు గెలిస్తే ఆయన బూట్ పాలిష్ చేస్తూ ఆయన కాలిదగ్గరే పడుంటా అంటూ కొడాలి నాని సవాల్ విసిరారు. దీనిపై గుంటూరులో ఫ్లెక్సీలు వెలిశాయి. 'కుప్పంలో చంద్రబాబు గెలిస్తే రాజకీయాలు వదిలేసి, ఆయన బూట్ పాలిష్ చేస్తూ ఆయన కాళ్ల దగ్గరే పడుంటా అని ఛాలెంజ్ చేసిన పిరికి సన్నాసి.. కొడాలి నాని ఎక్కడ దాక్కున్నా బయటకు రావాలి' అని ఆ ఫ్లెక్సీలో రాసివుంది. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పేరుతో గుంటూరులో ఈ ఫ్లెక్సీలు వెలిశాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు వైరలవుతున్నాయి. బూతుల మంత్రులను ఓటుతో కొట్టిన ఓటర్లు వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో బూతులతో రెచ్చిపోయిన మంత్రులందరినీ ప్రజలు ఇంటికి పంపించారు. వారికి ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పారు. కొడాలి నాని, రోజా, అంబటి రాంబాబు, పేర్ని నాని, జోగి రమేష్, వల్లభనేని వంశీ, అనిల్ కుమార్ యాదవ్ లాంటి నేతలందరినీ ప్రజలు నేలకేసి కొట్టారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం అతి కష్టం మీద ఆరువేల ఓట్లతో గట్టెక్కగలిగారు. హుందాగా రాజకీయాలు చేయకుండా ప్రతిపక్ష నేతలందరినీ టార్గెట్ చేస్తూ, నోటికొచ్చినట్లు మాట్లాడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తే ఓటుతో కొడతామని ప్రజలు నిరూపించారని ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయపడుతున్నారు.

## పాడి కౌశిక్ రెడ్డిపై మండి పడుతున్న ఫ్లైయాష్ కాంట్రాక్టర్లు..



హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపణలపై ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదని ఫ్లైయాష్? కాంట్రాక్టర్ల సంఘం తెలిపింది. ఫ్లైయాష్ రవాణా ద్వారా 100 కోట్ల స్కామ్ జరిగిందని చెప్పడం అవగాహన రహిత్యమన్నారు. శనివారం ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సంఘం నేత సమద్‌న ఈ విషయమై మాట్లాడారు. తనకు కమీషన్ ఇవ్వలేదనే కోపంతోనే పొన్నం ప్రభాకర్ పై కౌశిక్ రెడ్డి ఆరోపణలు చేశారన్నారు. కమీషన్ ఇవ్వనందుకే ఫ్లైయాష్ రవాణా చేస్తున్నవారిపై కక్ష పూరితంగా తప్పుడు కేసులు పెడుతున్నట్టు పేర్కొన్నారు. ఎన్టీపీసీలో సింగరేణి నుంచి వచ్చిన బొగ్గు ద్వారా కరెంటు ఉత్పత్తి జరుగుతుందన్నారు. అనంతరం బూడిదగా మారిన బొగ్గు వేల ఎకరాల్లో పేరుకు పోతుందన్నారు. పేరుకు పోయిన ఫ్లైయాష్ ను తరలించేందుకు ఎన్టీపీసీ టెండర్లను ఆహ్వానిస్తుందని గుర్తు చేశారు. గ్రావెల్ అందుబాటులో లేని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్లకు ఉచితంగా ఈ బూడిదను అందిస్తున్నట్టు వివరించారు. ఫ్లైయాష్ రవాణాపై ఆధార పడి మూడు వందల మంది జీవిస్తున్నారని గుర్తు చేశారు. ఫ్లైయాష్ కాంట్రాక్ట్ మొత్తం 150 కోట్లు కాగా.. ఇప్పటి వరకు 30 కోట్ల పనులే జరిగినట్లు తెలిపారు. అలాంటప్పుడు 100కోట్ల కుంభకోణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సమావేశంలో రవీందర్, మల్లేశం, రాజేశ్, ఫరీద్, శ్రీపాల్?తదితరులు పాల్గొన్నారు. కొద్ది రోజుల క్రితం పాడి కౌశిక్ రెడ్డి పొన్నం ప్రభాకర్ పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. కౌశిక్ రెడ్డి ఆరోపణలపై గౌడ సంఘం నేతలు కూడా ఖండించారు.

## టీటీడీ నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు



హైదరాబాద్: ఏపీలో కొత్త ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో కొందరు ఉన్నతాధికారులకు స్థాన చలనం కలుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో టీటీడీ ఈవోగా వ్యవహరించిన ధర్మారెడ్డిని కూటమి ప్రభుత్వం పక్కనబెట్టింది. దాంతో ఆయన సెలవుపై వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో, టీటీడీ నూతన ఈవోగా ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావును నియమించారు. శ్యామలరావు ఇవాళ టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టారు. సంప్రదాయం ప్రకారం మొదట వరాహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సతీసమేతంగా వచ్చిన శ్యామలరావుకు టీటీడీ వర్గాలు స్వాగతం పలికాయి. మాజీ ఈవో ధర్మారెడ్డి శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ, ఎంతో పవిత్రతో కూడిన తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో పదవిని అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. ఈ పదవిని చేపట్టే అవకాశం తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

## జమ్ము కాశ్మీర్ లో వరుసగా ఉగ్రదాడులు.. అమిత్ షా సమీక్ష




జమ్మూ కశ్మీర్లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కశ్మీర్ లో భద్రతా పరిస్థితిపైనే ప్రధానంగా చర్చించినట్టు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పరిణామాలపై అధికారులు హోం మంత్రికి వివరణ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ కార్యకలాపాలను మరింత ఉధృతం చేసేందుకు భద్రతా బలగాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఉగ్రవాద చర్యలను నియంత్రించేందుకు అమిత్ షా పలు సూచనలు చేసినట్టు తెలుస్తోంది. అలాగే అమర్ నాథ్ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా పరిశీలించినట్టు తెలుస్తోంది. సందర్శకుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీ చేసినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ దేకా, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, ఇన్ కమింగ్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనిష్ దయాల్ సింగ్ వంటి అత్యున్నత భద్రతా అధికారులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు సీఎం చంద్రబాబు బక్రీద్ శుభాకాంక్షలు



స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్యఉద్దేశం అని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశమని, పండుగ సందర్భంగా ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారం వితరణగా ఇస్తారన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగగుణాన్ని ప్రబోధించే బక్రీద్ పండుగని స్ఫూర్తిగా తీసుకుని సమైక్యతను, సమానత్వాన్ని సాధిద్దాం అని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

# ప్రళయమొచ్చినా..ఈ ఐదూ బతికేస్తాయట!



ఏదైనా అత్యంత భయానక ప్రకృతి విపత్తు వస్తేనో, ఏదైనా పెద్ద ఆస్టరాయిడ్ ఢీకొంటేనో.. భూమ్మీది జీవరాశిలో చాలా వరకు నామరూపాలు లేకుండా పోవడం ఖాయం. కానీ ఓ ఐదు రకాల జీవులు మాత్రం బతికి ఉండగలుగుతాయట. వాటికి ఉన్న ప్రత్యేక లక్షణాలు, కఠిన పరిస్థితులను తట్టుకోగల సామర్థ్యమే దీనికి కారణమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అవేమిటో తెలుసుకుందామా..

### టాప్‌లో టార్డిగ్రేడ్‌లు..

జీవులన్నింటిలో అత్యంత కఠిన పరిస్థితులను తట్టుకుని బతకగలిగే అతి చిన్న జీవులు టార్డిగ్రేడ్లు. నీటిలో జీవిస్తుండటం, ఎలుగుబంటిని పోలి ఉండటంతో వీటిని వాటర్ బేర్‌లు అని కూడా పిలుస్తారు. 150 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలను, మైనస్ 70 డిగ్రీల వరకు తీవ్ర చలిని ఇవి తట్టుకోగలవు. ఆక్సిజన్, ఆహారం, నీళు లేని పరిస్థితుల్లోనూ వారాలకు వారాలు బతికేస్తాయి. అందుకే ప్రళయమొచ్చినా బతికే జీవుల్లో టార్డిగ్రేడ్లు టాప్‌లో ఉన్నాయి.

### బొద్దింకలూ బతికేస్తాయి..

మనను నానా చికాకు పెట్టే బొద్దింకలను అంత ఈజీగా తీసుకోవద్దు. ఎందుకంటే ఎన్నో విపత్కర పరిస్థితులను తట్టుకునే శక్తి వాటి సొంతం. డైనోసార్లతో కలిసి జీవించిన బొద్దింకలు.. భూమిని ఆస్టరాయిడ్ ఢీకొన్నప్పుడు డైనోసార్లు అంతమైపోయినా బతకగలిగాయి. మట్టిలో, రాళ్లలో, మరెక్కడైనా దూరిపోయి దాక్కోవడం, ఏది దొరికితే దాన్ని తిని బతికేయడం, చాలా వరకు విషపదార్థాలను, రేడియేషన్‌ను కూడా తట్టుకోగలగడం వీటి స్పెషాలిటీ. అందుకే ఎంత తీవ్ర విపత్తు వచ్చినా బొద్దింకలు బతికే అవకాశాలు ఎక్కువట.

### రాబందులను తక్కువగా చూడొద్దు

భూమ్మీద ప్రకృతి విపత్తు వచ్చే స్థాయిని బట్టి కొన్ని రకాల జంతువులకు లాభమూ జరుగుతుంది. అలాంటివాటిలో రాబందులు ఒకటి. ఆస్టరాయిడ్ భూమిని ఢీకొనడం వంటివి జరిగితే.. గాల్లో అంతెత్తున, చాలా దూరం ప్రయాణించి తప్పించుకోగలవు. విపత్తుల మరణించే జంతువుల మాంసాన్ని తింటూ బతికేయగలవు. కుళ్లిన మాంసంలో పెరిగే బ్యాక్టీరియాను, ఇతర సూక్ష్మజీవులను కూడా డైజెస్ట్ చేయగల యాసిడ్లు రాబందుల జీర్ణాశయంలో ఉత్పత్తి అవుతాయి.

### షార్క్‌లకు విపత్తులంటే లెక్కే లేదు..

భూమ్మీది పురాతన జీవుల్లో షార్క్ చేపల జాతి కూడా ఒకటి. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం.. భూమ్మీద చెట్లు ఏర్పడకముందే సముద్రాల్లో షార్క్‌ల జాతి ఉద్భవించి జీవిస్తున్నాయి. తర్వాత జరిగిన ప్రకృతి ఉత్పాతాల్లో డైనోసార్లు సహా ఎన్నో జీవజాతులు అంతరించినా షార్క్‌లు మాత్రం బతికేస్తూనే ఉన్నాయి. సముద్రాల్లో అత్యంత లోతున, ఎలాంటి వెలుగు ప్రసరించని చోట, తీవ్ర పీడనాన్ని తట్టుకుని బతకగలగడం షార్క్‌ల స్పెషాలిటీ. ఇప్పుడు మరో విపత్తు వచ్చినా అవి తట్టుకుని బతికేయగలవు మరి.

### ఎంపరర్ పెంగ్విన్లకూ చాన్స్ ఎక్కువే..

అంటార్కిటికా ఖండంలో ఉండే అత్యంత శీతల పరిస్థితులను, గంటకు 200 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులను తట్టుకుని జీవిస్తున్న జంతువులు ఎంపరర్ పెంగ్విన్‌లు. వాటి శరీరంలో గణనీయంగా కొవ్వు ఉంటుంది. కొన్నివారాల పాటు ఆహారం లేకున్నా బతికేయగలవు. పైగా అవి ఉన్న ప్రాంతాల్లో విపత్తులు ఏర్పడే అవకాశాలూ తక్కువని, నిక్షేపంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

# చైనా అండతోనే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం

**ఉమ్మడి ప్రకటన విడుదల చేసిన జీ7 దేశాల అధినేతలు**

**యుద్ధానికి మద్దతివ్వడం మానుకోవాలని చైనాకు హితవు**




రోమ్: 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఇంకా కొనసాగుతోంది. ఉక్రెయిన్‌పై రెండేళ్లకుపైగా దాడులు కొనసాగించే శక్తి రష్యాకు ఎలా వచ్చింది? అమెరికాతోపాటు పశ్చిమ దేశాలు డ్రాగన్ దేశం చైనా వైపు వేలెత్తి చూపిస్తున్నాయి. చైనా అండదండలతోనే ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడులు చేస్తోందని, సాధారణ ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటోందని జీ7 దేశాలు ఆరోపించాయి. ఇటలీలో సమావేశమైన జీ7 దేశాల అధినేతలు తాజాగా ఈ మేరకు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. చైనా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చైనా అండ చూసుకొని రష్యా రెచ్చిపోతోందని ఆరోపించారు. రష్యా యుద్ధ యంత్రానికి చైనానే ఇంధనంగా మారిందని జీ7 దేశాలు మండిపడ్డారు. రష్యాకు మిస్సైళ్లు డ్రోన్లు చైనా నుంచే వస్తున్నాయని ఆక్షేపించారు.

జీ7 దేశాలు సాధారణంగా రష్యాను తమ శత్రుదేశంగా పరిగణిస్తుంటాయి. ఈ జాబితాలో ఇప్పుడు చైనా కూడా చేరినట్లు కనిపిస్తోంది. మారణాయుధాలు తయారు చేసుకొనే పరిజ్ఞానాన్ని రష్యాకు డ్రాగన్ అందిస్తోందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విమర్శించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలైన తర్వాత రష్యాకు చైనా నేరుగా ఆయుధాలు ఇవ్వకపోయినా ఆయుధాల తయారీకి అవసరమైన విడిభాగాలు, ముడి సరుకులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సరఫరా చేస్తోందని ఆక్షేపించారు.

### చైనాలో మానవ హక్కుల ఉల్లంఘన

ఉక్రెయిన్‌లో మారణహోమం సృష్టించేలా రష్యాకు సహకరిస్తున్న దేశాలపై, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోకతప్పదని జీ7 దేశాల అధినేతలు తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌పై చట్టవిరుద్ధమైన యుద్ధానికి మద్దతివ్వడం మానుకోవాలని హితవు పలికాయి. ఉక్రెయిన్‌పై దాడుల తర్వాత రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో తమకు అవసరమైన సరుకులను చైనా నుంచి రష్యా దిగుమతి చేసుకుంటోంది. అలాగే రష్యా నుంచి చైనా చౌకగా చమురు కొనుగోలు చేస్తోంది. ఇరుదేశాలు పరస్పరం సహరించుకుంటున్నాయి. టిబెట్, షిన్‌జియాంగ్‌తోపాటు హాంకాంగ్‌లో చైనా దూకుడు చర్యలను జీ7 సభ్యదేశాలు తప్పుపట్టాయి. చైనా మానవ హక్కుల ఉల్లంఘన కొనసాగుతోందని ఆరోపించాయి. మరోవైపు డ్రాగన్ దేశం అనుసరిస్తున్న వ్యాపార విధానాలను అమెరికాతోపాటు యూరోపియన్ యూనియన్(ఈయూ) దేశాలు తప్పుపడుతున్నాయి. ఎలక్ట్రికల్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులు, సోలార్ ప్యానెళ్ల తయారీకి చైనా ప్రభుత్వం భారీగా రాయితీలిస్తోంది. దీంతో ఇవి చౌక ధరలకే అందుబాటులో ఉంటూ విదేశీ మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ఫలితంగా ఆయా దేశాల్లో వీటిని తయారు చేసే కంపెనీలు గిరాకీ లేక మూతపడుతున్నాయి. ఫలితంగా ఉద్యోగాల్లో కోతపడుతోంది. చైనా దిగుమతులతో పశ్చిమ దేశాలు పోటీపడలేకపోతున్నాయి. చైనా ఎత్తుగడలను తిప్పికొట్టడానికి చైనా ఉత్పత్తులపై అమెరికాతోపాటు ఈయూ దేశాలు భారీగా పన్నులు విధిస్తున్నాయి.

# కమిషన్ నుంచి తప్పుకోండి

**మీ విచారణలో నిష్పాక్షికత కనిపించడం లేదు**

**'విద్యుత్' కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ లేఖ**

**రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ విచారణ కమిషన్**

**నన్ను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నాలు**

**వ్యతిరేక రిపోర్టు ఇవ్వాలన్నదే మీ అభిప్రాయం**

**పరిధి దాటి వ్యవహరిస్తూ బద్నాం చేస్తున్నారు**

**మీ తీరు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం**

**15లోగా హాజరై సమాధానం ఇవ్వాలనుకున్నా**

**నిష్పక్షపాతంగా విచారణ జరగట్లేదని తేలిందని వ్యాఖ్య**



హైదరాబాద్: విద్యుత్ అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ విచారణలో నిష్పాక్షికత కనిపించడం లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. విచారణ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలని కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాజకీయ కక్షతో గత ప్రభుత్వాన్ని, తనను అప్రతిష్ట పాలు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఈ మేరకు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ జస్టిస్ నరసింహారెడ్డికి శనివారం సుదీర్ఘ లేఖ రాశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై వివరణ ఇవ్వాలని కేసీఆర్‌ను గతంలో ఎంక్వైరీ కమిషన్ కోరింది. దీనికి కమిషన్ ఇచ్చిన గడువు శనివారంతో ముగుస్తున్న నేపథ్యంలో కేసీఆర్ ఈ లేఖ రాశారు. అందులో పేర్కొన్న వివరాలు ఆయన మాటల్లోనే.. "విద్యుత్ రంగంలో గణనీయ మార్పు చూపించిన మా ప్రయత్నాన్ని తక్కువ చేసి చూపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. విచారణ కమిషన్ చైర్మన్‌గా మీడియా సమావేశంలో మీరు (జస్టిస్ నరసింహారెడ్డి) ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం నాకెంతో బాధ కలిగించింది. మీ పిలుపు మేరకు లోక్‌సభ ఎన్నికల తర్వాత 2024 జూన్ 15లోగా నా అభిప్రాయాలను మీకు సమర్పించాలని అనుకున్నాను. కానీ ఒక ఎంక్వైరీ కమిషన్ సంప్రదాయాలకు విరుద్ధంగా, విచారణ పూర్తికాక ముందే మీరు మీడియా సమావేశం పెట్టి నా పేరును ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నేను వ్యవధి అడిగితే దాన్ని కూడా ఏదో దయతలచి ఇచ్చినట్టు మాట్లాడటం నాకెంతో బాధ కలిగించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి రిటైరైనప్పటికీ మీ తీరు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉంది. విచారణ పూర్తికాక ముందే తీర్పు ప్రకటించినట్టుగా మీ మాటలున్నాయి. మీ విచారణలో నిష్పాక్షికత ఎంత మాత్రం కనిపించడం లేదు. అందువల్ల ఇప్పుడు నేను మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదని స్పష్టమవుతున్నది.

చట్టవిరుద్ధంగా ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు..

విచారణ ఒక పవిత్రమైన బాధ్యత, మధ్యవర్తిగా నిలిచి నిజాన్ని నిగ్గుతేల్చాల్సిన విధి. అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించి పూర్తి నిర్ధారణకు వచ్చిన తర్వాత, డాక్యుమెంటరీ సాక్ష్యాలతో బాధ్యులకు మాత్రమే నివేదిక ఇవ్వాల్సిన గురుతరమైన పని. కానీ మీ వ్యవహారశైలి అలా లేదని చెప్పేందుకు చింతిస్తున్నాను. ఎంక్వైరీ కమిషన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిపోర్టు ఇవ్వాలనే అభిప్రాయంతోనే మీరు మాట్లాడుతున్నట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే తప్పు జరిగిందని, తద్వారా జరిగిన ఆర్థిక నష్టాన్ని లెక్కించడం మాత్రమే మిగిలి ఉందన్నట్టుగా మీ మాటలు ఉంటున్నాయి. రాష్ట్రంలో జరిగిన రాజకీయ మార్పులతో సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వానికి దురుద్దేశాలు ఆపాదిస్తూ అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రాలపై చర్చలు కూడా జరిగాయి. అంతటితో ఆగకుండా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ సంస్థలు వెలువరించిన తీర్పులపై విచారణ జరపకూడదనే ఇంగితం లేకుండా రేవంత్‌రెడ్డి ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేశారు. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన మీరు ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విచారకరం. అయినా చట్టవిరుద్ధంగా విచారణ ప్రారంభించి జూన్ 11న మీడియా సమావేశంలో మీరు అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు.

విచారణ అర్హత కోల్పోయారు.. విరమించుకోండి

భద్రాద్రి పవర్ ప్లాంటును రెండేళ్లలో పూర్తి చేస్తామనే బీహెచ్ఈఎల్ లిఖిత పూర్వక హామీ మేరకు పనులు అప్పగించాం. ఎన్జీటీ స్టే, కరోనాతో కలిగిన అంతరాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఆలస్యానికి ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్టుగా మీరు మాట్లాడారు. ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందాలను ఎస్ఈఆర్సీ పరిశీలించకూడదని, అందులో ఏదో తప్పు జరిగిందనే భావన కలిగేలా మాట్లాడారు. న్యాయ నిపుణులైన మీరు చట్టాల్లో పొందుపరచబడిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా న్యాయ ప్రాధికార సంస్థలపై వ్యాఖ్యానాలు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై మీరు విచారణార్హత కోల్పోయినందున ఈ బాధ్యతల నుంచి విరమించుకోవాలి. తమిళనాడు, కర్నాటక టెండర్ పద్ధతిలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్న మొత్తంతో పోలిస్తే ఛత్తీస్‌గఢ్ నుంచి నామినేషన్ పద్ధతిలో తెలంగాణ కొనుగోలు చేసిన యూనిట్ విద్యుత్ ధర తక్కువ. కానీ ఎక్కువ ధర చెల్లించారని మీరు చెప్పినందున విచారణ అర్హత కోల్పోయారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలన్నీ (పీపీఏ) ప్లాంట్ల నిర్మాణం ప్రారంభించడానికి ముందే జరుగుతాయన్న వాస్తవాన్ని విస్మరించారు. భద్రాద్రి సబ్ క్రిటికల్ థర్మల్ స్టేషన్ నిర్మాణం విజయవంతంగా పూర్తి చేసినా అప్పటి ప్రభుత్వం ఏదో తప్పు చేసిందనే దురుద్దేశాలు ఆపాదించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణానికి ప్రాంతీయ మౌలిక సదుపాయాల సమతుల్యత, ఆర్థికాభివృద్ధి, లోడ్ డిస్ట్రిబ్యూషన్, విద్యుత్ సరఫరా నష్టాలు తగ్గించడం, విపత్తుల నివారణ (డీ రిస్కింగ్) అనేవి కూడా ప్రధాన ప్రాతిపదికలుగా ఉంటాయనే వాస్తవాన్ని విస్మరించారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తికాలేదని చెప్పడం అసమంజసం.

గత ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే ధోరణి

జస్టిస్ నరసింహారెడ్డిగారూ.. మీరు కూడా తెలంగాణ బిడ్డ. 2014కు ముందు తెలంగాణలో కరెంటు పరిస్థితి ఎట్లుండేదో, తర్వాత ఎట్లున్నదో అందరితోపాటు మీకూ తెలుసు. చీకటి రోజుల గతాన్ని వెలుగు జిలుగుల భవిష్యత్తుగా మార్చడానికి అప్పటి ప్రభుత్వం ఏం చేసిందో మీరు కూడా చూశారు. అయినా మీ పరిధి దాటి వ్యవహరించి మాట్లాడటం గత ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే మీ ధోరణికి నిదర్శనంగా కనిపిస్తోంది. తెలంగాణ నిర్ణయాన్ని ఎలాగైనా తప్పుబట్టాలనే తీరులో మీరు కనిపిస్తున్నారు. అందువల్ల విచారణ కమిషన్ చైర్మన్ బాధ్యతల్లో మీరు ఉండటం ఎంత మాత్రం సమంజసం కాదు. స్వచ్ఛందంగా విరమించుకోండి" అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.

## మరో భారీ డీల్‌ను దక్కించుకున్న ఇన్ఫోసిస్




భారత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ పలు కొత్త ప్రాజెక్టులతో దూసుకెళ్తోంది. తాజాగా స్వీడన్ రిటైలర్ ఐకియా నుంచి 100 మిలియన్ డాలర్ల (రూ.850 కోట్లు) డీల్‌ను దక్కించుకుంది. హెచ్‌సీఎల్, క్యాప్ జెమినీ, డీఎక్స్‌సీ వంటి బడా కంపెనీలను దాటుకుని ఈ భారీ డీల్‌ను సొంతం చేసుకుంది. ఈ ఐదేళ్ల ఒప్పందం ప్రకారం.. ఇన్ఫోసిస్ 1,70,000 మంది ఉద్యోగులకు సర్వీస్ డెస్క్, సర్వీస్ నౌ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ సర్వీస్ మేనేజ్మెంట్, ఐటీ సర్వీసెస్ మేనేజ్మెంట్‌ను అందిస్తుంది. ఇన్ఫోసిస్ కన్స్యూమర్, రిటైల్, లాజిస్టిక్స్ గ్లోబల్ హెడ్, ఈవీపీ కర్మేష్ వాస్వానీ ఈ డీల్‌కు నేతృత్వం వహించారు. గత ఏడాది ఐటీ దిగ్గజం డాన్స్‌కే బ్యాంక్ నుంచి 454 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ డీల్ కారణంగా చైనా, ఫ్రాన్స్, జర్మనీ, భారత్, పోలాండ్, స్వీడన్, అమెరికా దేశాల్లో ఐకియాలో 350 ఉద్యోగాలపై ప్రభావం పడనుంది. ఈ ఉద్యోగులు ఇన్ఫోసిస్ కు మారనున్నారు. కోల్డ్ కాలింగ్, కొన్ని ప్రారంభ కనెక్షన్లతో ప్రారంభమై వ్యూహాత్మక భాగస్వామ్యంతో ముగిసిన మూడేళ్ల సుదీర్ఘ, సంతృప్తికరమైన ప్రయాణం అని ఇన్ఫోసిస్ కొందరు ఎంపిక చేసిన ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్స్‌లో పేర్కొంది.

## నేడు పోలవరం ప్రాజెక్ట్ ను సందర్శించనున్న సీఎం చంద్రబాబు



ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన తన మొదటి పర్యటనలో భాగంగా సోమవారం పోలవరం వెళ్లనున్నారు. ప్రాజెక్టును సందర్శించి వాటి ప్రస్తుత స్థితిగతులను జలవనరులశాఖ అధికారులతో సమీక్షించనున్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని చంద్రబాబు పూనుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారన్నారు. పోల వరం ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధా న్యత కారణంగానే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం చంద్రబాబు పోలవరం పర్యటనకు రానుండడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎస్ఈ నరసింహమూర్తి మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. శనివారం పోలవరం ప్రాజెక్టు అతిథి గృహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టులో స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాం గ్యాప్ 3 పనులు పూర్తయ్యాయని, గ్యాప్ 1, 2 ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం పనులు పూర్తి చేయాల్సి ఉందన్నా రు. డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో నూతనంగా నిర్మించాల్సి ఉందని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. డిజైన్స్ ఆమోదం కాగానే డయాఫ్రం వాల్ నిర్మించాల్సి ఉంటుందని తెలిపారు. గ్రౌండ్ ఇంప్రూవ్ మెంట్, వైబ్రో కాంపాక్షన్ పనులు, అనంతరం ఎంబాక్‌మెంట్ పనులు, మెయిన్ డ్యాం పనులు చేస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి కేంద్ర సహకారం కూడా ఉండటంతో త్వరలో ప్రాజెక్టు పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇందిరాగాంధీని "భారతమాత" అన్న వ్యాఖ్యలపై కేంద్రమంత్రి వివరణ..



మాజీ ప్రధాని ఇందిరాగాంధీని "భారతమాత" అని కేంద్రమంత్రి సురేష్ గోపీ శనివారం వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో.. ఆ వ్యాఖ్యలపై ఆయన వివరణ ఇచ్చారు. ఇందిరాగాంధీని కాంగ్రెస్ పార్టీకి 'తల్లి' అని అన్నానని, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఈరోజు మీడియాకు తెలిపారు. తాను హృదయపూర్వకంగా మాట్లాడే వ్యక్తినని.. ఇందిరా గాంధీ గురించి తాను మాట్లాడిన దాంట్లో తప్పు లేదని అన్నారు. ఎవరికీ నచ్చినా, నచ్చకపోయినా కేరళలో కాంగ్రెస్ పార్టీకి తండ్రి కె. కరుణాకరన్.. భారతదేశంలో కాంగ్రెస్ కు తల్లి ఇందిరాగాంధీ అని అన్నారు. మరోవైపు.. పెట్రోలియం మరియు పర్యాటక శాఖ సహాయ మంత్రి కూడా ఈరోజు ఇందిరా గాంధీపై ప్రశంసలు కురిపించారు. "ఇందిరా గాంధీ స్వాతంత్ర్యానంతరం నుంచి ఆమె మరణించే వరకు భారతదేశానికి నిజమైన ఆర్కిటెక్ట్. ఆమె రాజకీయ ప్రత్యర్థి పార్టీకి చెందినది అయినప్పటికీ.. దేశం కోసం నిజాయితీగా పనిచేసిన వ్యక్తిని నేను మరచిపోలేను" అని అన్నారు. శనివారం త్రిసూర్‌లోని దివంగత కాంగ్రెస్ ముఖ్యమంత్రి కె.కరుణాకరన్ స్మారకాన్ని కేంద్రమంత్రి సురేష్ గోపీ సందర్శించిన సంగతి తెలిసిందే.. ఈ క్రమంలో.. ఆయన మాట్లాడుతూ, ఇందిరా గాంధీని "భారతమాత", కరుణాకరన్ "ధైర్యవంతమైన నిర్వాహకుడు" అని అభివర్ణించారు. అంతేకాకుండా.. కరుణాకరన్, మార్క్సిస్ట్ అనుభవజ్ఞుడు ఇకె నాయనార్‌లు తన "రాజకీయ గురువులు"గా భావిస్తున్నానని సురేష్ గోపీ చెప్పారు.

## ఢిల్లీలో నీటి కోసం ఘర్షణ.. ముగ్గురికి గాయాలు



ఢిల్లీలో నీటి సమస్య తీవ్ర తరమవుతుంది. నీటి కోసం దాడులు చేసుకున్న సంఘటనలు వెలువడుతున్నాయి. ద్వారకా జిల్లాలో నీటి కోసం పెద్ద ఎత్తున ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు.. సంఘటన స్థలానికి చేరుకుని వారికి సర్దిచెప్పారు. అయితే.. ఈ ఘర్షణలో ఎలాంటి మతపరమైన కోణం లేదని పోలీసులు స్పష్టం చేశారు. పబ్లిక్ కుళాయి నుంచి నీటిని తీసుకునే విషయంలో ఘర్షణ జరిగినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ ఘర్షణలో గాయపడ్డ ముగ్గురు వ్యక్తులను ఇందిరాగాంధీ ఆసుపత్రికి చికిత్స అందిస్తున్నారు. అయితే.. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేశామన్నారు పోలీసులు. ఇరువర్గాల వాంగ్మూలాలపై విచారణ జరుపుతున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఎండ వేడిమి తీవ్రతతో ఢిల్లీలో నీటి సమస్య తీవ్రంగా ఉన్న సంగతి తెలిసిందే.. నీటి సమస్యపై రాజకీయ రగడ సాగుతోంది. కుట్రలో భాగంగా.. పైపులైన్‌ను లీక్ చేసి, ప్రజలకు నీరు అందకుండా చేశారని ఢిల్లీ నీటి మంత్రి అతిషి ఆరోపించారు. ఢిల్లీలోని నీటి పైపులైన్ల భద్రతను పెంచాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను కోరారు. ఈ పైప్‌లైన్‌ను ఎవరు పగలగొడుతున్నారని మంత్రి సౌరభ్ భరద్వాజ్ ప్రశ్నించారు. దీనిపై విచారణ జరపాలన్నారు. మరోవైపు.. ఢిల్లీలో నీటి సమస్యతో బాధపడుతున్న ప్రజలు ఛతర్‌పూర్‌లో ఉన్న ఢిల్లీ జల్ బోర్డు కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా.. ఢిల్లీ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. ఢిల్లీ ప్రభుత్వం అవినీతి ప్రభుత్వమని బీజేపీ నేత రమేషా బిధూరి విమర్శించారు. ఢిల్లీ జల్ బోర్డులో ఎలాంటి ఆడిట్ జరగలేదని.. ఢిల్లీ జల్ బోర్డు రూ.70,000 కోట్ల నష్టాల్లో ఉందని తెలిపారు. ఛతర్‌పూర్‌లోని డీజేబీ కార్యాలయంలో జరిగిన విధ్వంసంపై బిధురి మాట్లాడుతూ.. ఇది సహజం. ప్రజలు కోపంగా ఉన్నప్పుడు ఏదైనా చేయగలరని అన్నారు. బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ మాట్లాడుతూ.. 'ఢిల్లీలో ఏటా నీటి కొరత ఏర్పడుతోందని.. ఎవరు ఎవరిని మోసం చేయట్లేదని మంత్రి అతిషిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 10 ఏళ్లలో ఏ పైపులు మార్చారో.. మంత్రి అతిషి వైట్ పేపర్ పై రాసివ్వాలని కోరారు. ఢిల్లీ ప్రజలకు సాకులు చెప్పేవాళ్లు అక్కర్లేదని కేజ్రీవాల్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ

### కార్యకర్తలు సాధికారత సాధిస్తేనే పార్టీ బలోపేతం

### కింద స్థాయి నుంచి ఎవరు ఎక్కడ పనిచేశారో తెలుసుకుంటున్నా

### కష్టపడి పనిచేసినవారికి పదవులు ఇస్తా

### ఎమ్మెల్యేలు.. కార్యకర్తలను విస్మరించొద్దు

### టీడీపీ ప్రధాన కార్యాలయంలో సీఎం చంద్రబాబు



అమరావతి: త్వరలోనే నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో కింది స్థాయి నుంచి ఎవరు, ఎక్కడ ఏం పని చేశారో తెలుసుకుంటున్నానన్నారు. నాయకులు, కార్యకర్తలు సాధికారత సాధిస్తేనే పార్టీ పునాదులు బలంగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో వారికి ఎలా చేయాలి, ఏం చేయాలనే విషయంపై ఆలోచిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తానన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు శనివారం తొలిసారి గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పలువురు నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు దిగారు. అనంతరం టెలీకాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. తాను ఇకపై తరచూ పార్టీ కేంద్ర కార్యాలయానికి, జిల్లాలకు వెళ్లినప్పుడు జిల్లా పార్టీ కార్యాలయాలకు వెళతానని తెలిపారు. గతంలోనే కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి సాయం అందించామని, ఇక ముందు కూడా ఇలాగే ఆదుకుంటానన్నారు. అధికారం వచ్చిందని కక్షసాధింపు చర్యలకు పాల్పడటం, విర్రవీగడం చేయొద్దన్నారు. ఎమ్మెల్యేలు.. నాయకులు, కార్యకర్తలను విస్మరించవద్దని సూచించారు. ప్రజలు తప్పుపట్టేలా ఎటువంటి పనులు చేయొద్దని హెచ్చరించారు. కూటమి విజయం వెనుక నాయకులు, కార్యకర్తల కష్టం.. కృషి ఎంతో ఉన్నాయన్నారు. కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 57 శాతం ఓట్ షేర్‌ను సాధించిందని తెలిపారు. ప్రజలు ఇచ్చిన మెజారిటీని కాపాడుకోవాలన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేసి 16,347 ఉద్యోగాల భర్తీకి ఆదేశాలు ఇచ్చామని గుర్తు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్షన్ రూ.4 వేలకు పెంపుపై మూడో సంతకం, స్కిల్ గణనపై నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై ఐదో సంతకం చేశానని తెలిపారు. యువతలో నైపుణ్యం ఏ మేరకు ఉందో గణన చేసి అవసరమైన అవకాశాలు కల్పిస్తామన్నారు. నైపుణ్య గణనతో జీవన ప్రమాణాలను మార్చడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. 2014-2019 మధ్య ఎక్కడెక్కడ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామో, వాటన్నింటినీ వంద రోజుల్లోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మార్చేలా పథకాలు అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రజాపాలనకు శ్రీకారం చుట్టామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకెళ్తామని చెప్పారు.

### వినతుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ

ప్రజల సమస్యలు, వినతుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. నిర్దిష్ట సమయంలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయానికి రాకపోకలు కొనసాగించేందుకు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తామని చెప్పారు. పోలవరం సందర్శనతోనే తన క్షేత్ర స్థాయి పర్యటనలు ప్రారంభమవుతాయన్నారు. విధ్వంస పాలనకు గుర్తుగా ప్రజా వేదిక శిథిలాలను అలాగే ఉంచుతామని, తొలగించేది లేదని వెల్లడించారు.

# మోడీ ప్రమాణం రోజున చిరుత..!

### బీజేపీకి సీట్లు తగ్గినా..టాపిక్ డైవర్ట్ చేయటమే టార్గెట్-

### విపరీత ప్రచారం కల్పిస్తున్న టీం

### ఇందులో పలువురు జర్నలిస్టులు, న్యాయవాదులు

### కాషాయ ఎజెండాను మోస్తూ ప్రజల మెదళ్లను ప్రభావితం చేస్తున్న వైనం



న్యూఢిల్లీ : మోడీ ప్రమాణ స్వీకారం రోజున చిరుత కనిపించిందంటూ గోడి మీడియా తెగ ప్రచారం చేసింది. బీజేపీ సీట్లు తగ్గి..ఎన్డీఏ సంకీర్ణం ఉంటుందా..అన్న విషయాలపై చర్చ నడిచింది. ఈ టాపిక్ను డైవర్ట్ చేయటానికి దేశంలోని పలు మీడియా ఛానెళ్లు, వార్తపత్రికలు, అందులోని జరల్నిస్టులు, మరికొందరు స్వయం ప్రకటిత మేధావులు, న్యాయవాదులు.. మోడీకి మెహర్బానీ చాటుకుంటున్నారు. 2014లో మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చింది మొదలు.. కొన్ని మీడియా ఛానెళ్లు పని కట్టుకొని మరీ కాంగ్రెస్ వంటి ప్రధాన ప్రతిపక్షంతో పాటు ఇతర విపక్షాలను విమర్శించటం, బీజేపీ ఎజెండాను మోయటం చేశాయి. ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేయటంలో ఈ మోడీ 'టీం' విజయం సాధించింది. అయితే, 2024 ఎన్నికల్లో మాత్రం ప్రజలు మోడీనే కాదు.. వీరి మాటలనూ నమ్మలేదు.. లోక్సభ ఎన్నికల్లో బీజేపీ ఆశించినన్ని సీట్లను దక్కించుకోలేకపోయినప్పటికీ.. ఎట్టకేలకు సంకీర్ణంతో గట్టెక్కి అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది. ప్రధానిగా మోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు. రాజ్భవన్లో జరిగిన ఈ కార్యక్రమాన్ని వీక్షించటానికి మోడీ పల్లకి మోస్తున్న ఈ 'టీం'కు కూడా ఆహ్వానం అందటం గమనార్హం. అయితే, వీరికి ఆహ్వానం అందటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని రాజకీయ విమర్శకులు అంటున్నారు. ఆప్ఇండియా అనే ఒక రైట్వింగ్ న్యూస్వెబ్సైట్ను నడుపుతున్న నుపుర్ శర్మకు కూడా ఆహ్వానం అందింది. 'హిందూత్వ బ్లాగ్'గా పేరు తెచ్చుకున్న ఈ వెబ్సైట్లో మొత్తం బీజేపీ, మోడీ అనుకూల వార్తలు, హిందూత్వ ఎజెండాను మోస్తూ చేసే ప్రచారమే ఎక్కువ. అయితే, ఈ వెబ్సైట్ ఎప్పుడూ విద్వేషాన్ని చిమ్ముతుంటుందనీ, అలాంటి బ్లాగ్ను నడిపే వ్యక్తికి ఆహ్వానం ఏమిటనీ పలువురు ప్రశ్నిస్తున్నారు. సుదర్శన్ న్యూస్ చీఫ్ సురేష్ చవాన్కేకు సైతం ఆహ్వానం అందింది. మీడియా పేరుతో ద్వేషపూరితమైన ప్రసంగాలతో చర్చలు నడిపే ఈయన.. ఒక మతాన్ని చెడుగా చూపించటంలో అనేక ప్రయత్నాలు చేశాడు. ఒక మతాన్ని ఆర్థికంగా బహిష్కరించాలని కూడా ఆయన ఒకానొక సమయంలో పిలుపునిచ్చాడు. హిందూ రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే చంపేస్తానని ప్రమాణాలు కూడా చేశాడు. భౌగోళిక రాజకీయ, సాధారణ నిపుణుడిగా పేరున్న రోషన్ సిన్హా ట్విట్టర్కు.. రైట్వింగ్కి ఇష్టమైన ట్విట్టర్ ఖాతా అని పేరున్నది. పాలస్తీనాపై నకిలీ వార్తలు ప్రచారం చేయటంతో తమిళనాడు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. అలాగే, వందలాది ఇస్లామాఫోబిక్ ట్వీట్లు చేస్తూ విద్వేషాన్ని ప్రచారం చేస్తున్నాడు. మోడీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఉన్న ఇండియా టుడే జర్నలిస్ట్ రాజ్దీప్ సర్దేశారు చుట్టూ పారిశుధ్య సిబ్బంది నిలబడి ఉన్న ఫోటోను చూపెడుతూ.. 'పారిశుద్ధ్య సిబ్బంది సరైన స్థలంలో ఉన్నారు' అనే శీర్షికతో రోషన్ సిన్హా పంచుకోవటం గమనార్హం. న్యాయవాదిగా ఉన్న సాయి దీపక్ కూడా ఈ టీంలోని వ్యక్తే. పలు డిబేట్లలో హిందూత్వకు, పరోక్షంగా మోడీ సర్కారుకు అనుకూలంగా వ్యవహరిస్తాడనే పేరు ఆయనకు ఉన్నది. అలాగే, 'స్టింగ్ రివీల్స్' అంటూ వివాదాస్పద కంటెంట్ను ప్రచారం చేసే వినోద్ కూడా ఈ జాబితాలోనే ఉన్నాడు. ఓన్లీ ఫ్యాక్ట్ అనే ఫ్యాక్ట్ చెక్ వెబ్సైట్ను నడుపుతున్న విజరు పటేల్.. ఎక్కువగా లెఫ్ట్ భావజాలంతో నడిచే మీడియా సంస్థలను లక్ష్యంగా చేసుకుంటారు. సదరు సంస్థలను తూలనాడిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ప్రొఫెసర్ ఆనంద్ రంగనాథన్.. కాశ్మీర్లో 'ఇజ్రాయిల్ లాంటి పరిష్కారం' కోసం పిలుపునిచ్చారు. హిందూత్వను సమర్థించే ఈయన.. మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా డిబేట్లలో పాల్గొంటాడు. ఈయనతో పాటు న్యూస్ 18 ఇండియాకు చెందిన అమన్ చోప్రా, రూబికా లియాఖత్, అమిష్ దేవగన్లు, టైమ్స్ నౌకు చెందిన నవికా కుమార్, ఆజ్ తక్కు చెందిన సుధీర్ చౌదరి, చిత్రా త్రిపాఠిలు ఆహ్వానిత జాబితాలో ఉన్నారు. వీరంతా జర్నలిజంలో ఉంటూ మోడీ అనుకూల విధానాన్ని అనుసరిస్తారనీ, వారు చెప్పే వార్తలూ, చేసే డిబేట్లు కూడా దానిని ప్రతిబింబిస్తాయని పలువురు విశ్లేషకులు అంటున్నారు.

# కాంగ్రెస్కు ఇది పునరుజ్జీవనమేనా

### హస్తం పార్టీ మరింత పుంజుకోవాలి- రాజకీయ విశ్లేషకులు, నిపుణుల సూచన

### ఇటీవలి లోక్సభ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గతంలో లోక్సభలో అత్యధికంగా 414 సీట్లు..



అత్యల్పంగా 47 స్థానాలు రెండింటినీ ఈ పార్టీ చూసింది. అయితే, 2024 లోక్సభ ఎన్నికలలో బీజేపీ మెజారిటీని తగ్గించటంలో విజయం సాధించి, తన సీట్లను పెంచుకోవటంలో సక్సెస్ పొందిన హస్తం పార్టీకి ఈ ఫలితాలు కొంత వరకు ఊపును తీసుకొచ్చాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

న్యూఢిల్లీ : 2024 లోక్సభ ఎన్నికలలో కాంగ్రెస్ 99 స్థానాలను గెలుచుకున్నది. 2019లో గెలుచుకున్న స్థానాల సంఖ్య 52 కంటే ఇది దాదాపు రెట్టింపు. ముఖ్యంగా, బలమైన ప్రాంతీయ పార్టీలతో పొత్తుతో ఎన్నికలలో పోటీ చేసిన రాష్ట్రాల నుంచి హస్తం పార్టీకి డజన్ల కొద్దీ సీట్లు వచ్చాయి. 'బీజేపీ కాంగ్రెస్-ముక్త్ భారత్ గురించి మాట్లాడింది. పార్టీ ఐసీయూలో ఉన్నదని చెప్పింది. లోక్సభ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీ సజీవంగా ఉన్నట్టు చూపిస్తున్నాయి' అని రచయిత, రాజకీయ విశ్లేషకులు రషీద్ కిద్వారు అన్నారు. కాంగ్రెస్ బలహీనమైన స్థితి నుంచి పోరాడుతున్నందున పార్టీలో ఈ ఉత్సాహం నెలకొన్నదని విశ్లేషకులు చెప్తున్నారు. కాంగ్రెస్ తన చరిత్రలో తొలిసారిగా సాధారణ ఎన్నికల్లో 330 కంటే తక్కువ మంది అభ్యర్థులను నిలబెట్టిందంటున్నారు. ' లోక్సభ ఫలితాల గణాంకాలు కాంగ్రెస్ పునరుద్ధరణను చూపుతున్నాయి. కానీ పునరుజ్జీవనం అనేది నిరంతర ప్రక్రియ. సమాధానం మధ్యలో ఎక్కడో ఉంటుంది' అని రాజకీయ విశ్లేషకుడు అమితాబ్ తివారీ అన్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత తన మొదటి ఇంటర్వ్యూలో ఇండియా టుడే టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజకీయ విశ్లేషకుడు ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్కు ఇది పునరుజ్జీవన క్షణమని ప్రజలు అనుకుంటున్నారు. కానీ అది నిజం కాదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాలైన కర్నాటక, తెలంగాణ, హిమాచల్ప్రదేశ్లను ప్రశాంత్ కిషోర్ ఉదాహరించారు. 'కర్నాటకలో, కాంగ్రెస్ ఒక విధంగా ఓడిపోయింది. కొన్ని నెలల క్రితం వారు తెలంగాణాను కైవసం చేసుకున్నారు. కానీ అక్కడ సాధారణ ఎన్నికల్లో కేవలం 50 శాతం సీట్లు సాధించారు. హిమాచల్ ప్రదేశ్లో అన్ని స్థానాల్లో ఓడిపోయింది.' అని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. రాజస్థాన్, మహారాష్ట్రలలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల ప్రదర్శన చక్కగా ఉన్నదని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాజస్థాన్లో గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ క్లీన్స్వీప్ నమోదు చేయగా.. కాషాయ పార్టీ నుంచి కాంగ్రెస్ ఎనిమిది స్థానాలను కైవసం చేసుకున్నది. హర్యానాలో కూడా కాంగ్రెస్ ఐదు సీట్లు గెలుచుకున్నది. హర్యానా, రాజస్థాన్ ఫలితాలను బట్టి ఓబీసీలు, ముస్లింలు, దళితులు మళ్లీ పార్టీకి ఓటు వేయటం ప్రారంభించారని రషీద్ కిద్వారు చెప్పారు. కాంగ్రెస్ పునరాగమనానికి మహారాష్ట్ర మంచి ఉదాహరణని ఆయన అన్నారు. అయితే, ఈ చెదురుమదురు ప్రదర్శనలు పాన్-ఇండియా పునరుజ్జీవనాన్ని చూపించవని ప్రశాంత్ కిషోర్ వాదించారు. 'ఇది కాంగ్రెస్ పాన్-ఇండియా పునరుజ్జీవనం అయి ఉంటే, పార్టీ తన బలమైన స్థానాల్లో మెరుగ్గా పని చేసి ఉండేది' అని ఆయన వాదించారు.

### కాంగ్రెస్-బీజేపీ ప్రత్యక్ష ఎన్నికల పోరాటాలు ఏమి సూచిస్తాయి

రాజకీయ విశ్లేషకుడు అమితాబ్ తివారీ మాట్లాడుతూ.. ఇతర విషయాలతోపాటు, కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవన అంశం బీజేపీతో ప్రత్యక్ష పోరాటంలో తెలుస్తుందని అన్నారు. '2019 లోక్సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్లు 190 స్థానాల్లో ప్రత్యక్ష పోరు సాగించగా.. బీజేపీ 175 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ కేవలం 15 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇది బీజేపీకి 92 శాతం స్ట్రైక్ రేట్. కాంగ్రెస్కు 8 శాతమే. 2024 లోక్సభ ఎన్నికలలో, 215 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రత్యక్ష పోటీ కనిపించింది. బీజేపీ 153 స్థానాలను గెలుచుకున్నది. కాంగ్రెస్ 62 స్థానాలకు పెరిగింది' అని తివారీ చెప్పారు. 2024లో 'ప్రత్యక్ష పోరాటాలలో' బీజేపీ స్ట్రైక్ రేట్ 70 శాతం కాగా, కాంగ్రెస్ స్ట్రైక్ రేట్ 8 శాతం నుంచి 30 శాతానికి భారీగా పెరిగింది. 'కాంగ్రెస్ నికర సీట్ల లాభాలు బీజేపీతో ప్రత్యక్ష పోరాటాల నుంచి వచ్చాయి. ఇది కాంగ్రెస్కు పెద్ద నైతిక బలం' అని తివారీ చెప్పారు. నాలుగు రాష్ట్రాలు మహారాష్ట్ర, యూపీ, బీహార్, తమిళనాడులలో కాంగ్రెస్ దాని ఇండియా మిత్రపక్షాల మద్దతుతో పోరాడింది. 2024 లోక్సభ ఎన్నికలలో గెలిచిన 99 సీట్లలో 31 స్థానాల్లో మిత్రపక్షాలు దోహదం చేశాయి.